




మట్టిని లోడు చేసుకునేందుకు వెళ్తున్న టిప్పర్లు



అందని.. అల్పాహారం

- పది విద్యార్థులకు అల్పాహార నిధులు లేనట్లేనా !
- హెచ్ఎంలు, ఎమ్మెల్సీ విజ్ఞప్తులు బుట్టదాఖలు చేసిన జడ్పీ పాలకవర్గం
- నెల గడుస్తున్నా నిధులు విడుదల చేయని వైనం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి18: నాడు నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖల్ని ఎటూ మార్చలేదు.. కనీసం పది విద్యార్థులకు పరీక్షల సమయంలో అల్పాహారం అందించడానికి ప్రభుత్వానికి మనసు రావడం లేదు. అల్పాహారం కోసం నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం వినతిపత్రాలు ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా జడ్పీ పాలక వర్గం పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయి డెడ్, మున్సిపల్ పాఠశాలల్లో పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దాదాపు 40వేలకు పైగా ఉన్నారు. మార్చిలో జరిగే పరీక్షలకు ఆయా విద్యార్థులకు ఏటా డిసెంబర్ నుంచే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ప్రారంభం అవుతాయి. మధ్యాహ్నా 12 గంటలకు పాఠశాలలో భోజనం పెడతారు. తరువాత సాయంత్రం దాదాపు 7 గంటల వరకు పాఠశాలలోనే పది విద్యార్థులు ఉం డాలి. ఈ సమయంలో వారు పాఠశాలలో ఆక లితో అలమటించాల్సిందే. ఈ నేపథ్యంలో పేద, దిగువ మధ్యతరగతికి చెందిన వారికి అల్పాహారం అందించడానికి ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా ఏర్పాట్లు చేస్తోంది.

అప్పట్లో అలా... ఇప్పుడిలా..

పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం కోసం ఒక్కో విద్యార్థికి రూ.7 నుంచి రూ.10 చొప్పున నిధులు మొత్తం దాదాపు రూ.35లక్షల కు పైగా ఏటా విడుదల చేసేవారు. గత ప్రభుత్వాల హ యాంలో దాదాపు మూడునెలల ముందే అల్పాహారం కోసం నిధులు విడుదల చేయడంతోపాటు దాతల నుంచి మరికొంత సొమ్ము సమకూరేలా ఏర్పాట్లు చేసేశారు. ఫలితంగా విద్యార్థుల కు రోజు సాయంత్రం ఇడ్లీ, ఉప్మా, ఉడికించిన వేరుశనగలు, గుగ్గిళ్ళు వంటి అల్పాహారం, అరటి, జామ తదితర పండ్లు అందించేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పరీ క్షలకు నెలరోజు ముందు నుంచే అల్పాహారం పంపిణీ చేసేలా నిబంధనలు మార్చారు. దీనికి నిధులు కూడా సక్రమంగా విడుదల చేయడం లేదు. గత కొన్ని సంవత్సరాల నుంచి పాఠశాల గ్రాంట్ నుంచి వాడుకోవాలని, తరువాత నిధులు విడుదల చేస్తామని చెబుతూ వచ్చారు. ఈ ఏడాది పాఠశాల గ్రాంట్ కూడా సక్రమంగా పాఠశాలల కు విడుదల చేయకపోవడంతో హెచ్ఎంలు అల్పా హారం పంపిణీ విషయంలో చేతులెత్తేశారు. ఫలితంగా విద్యార్థులు ఆకలితో అలమటిస్తూ తరగతులకు హాజరు కావాల్సి వస్తోంది.

రెంటికిచెడ్డ రేవడిలా మున్సిపల్ విద్యార్థుల పరిస్థితి...

మున్సిపల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా మున్సిపాల్టీలు, కార్పొరేషన్ నుంచి అల్పాహారం కోసం నిధులు విడుదల అయ్యేవి. దాతలు, మున్సిపల్, కార్పొరేషన్ నిధులు కలిపి ఒక్కో విద్యార్థికి రూ.10 నుంచి రూ.20 వరకు విడుదల చేసేవారు. అయితే ఈ ఏడాది మున్సిపల్, కార్పొరేషన్ పరిధి నుంచి పాఠశాలల్ని తొలగించి ప్రభుత్వంలో విలీనం చేశారు. దీంతో ఈ విద్యార్థులకు అటు ప్రభుత్వం నుంచి కానీ ఇటు కార్పొరేషన్, మున్సిపల్ స్కూల్స్ నుంచి నిధులు విడుదల కావడం లేదు. రెంటికి చెడ్డ రేవడిలా విద్యార్థుల దుస్థితి తయారైంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అల్పాహారం కోసం నిధులు విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్తంభాలబోడు.. ఒకప్పుడు ఆధ్యాత్మికతకు ఆలవాలమైన ప్రాంతం. ఇప్పుడు అధికార పార్టీ నేతల అక్రమ సంపాదనకు నిలయంగా మారింది. నాటి చరిత్రను గర్వంగా భావితరాలకు అందించాల్సిన వారే గుట్టుచప్పుడు కాకుండా చరిత్రను కనుమరుగు చేస్తున్నారు.. అక్రమార్జనకు కాదేది అనర్హమంటూ ఆధ్యాత్మికతను సైతం అభాసుపాలు చేస్తున్నారు. బౌద్ధులు, జైనులు నడయాడిన నేలను కుళ్ల బొడు స్తున్నారు. టన్నుల కొద్దీ మట్టిని తవ్వి దోచేస్తూ జేబులు నింపుకుంటున్నారు. అడ్డగించిన వారి అడ్డు తొలగించుకుంటూ అడ్డే లేకుండా చేస్తున్నారు. పర్యాటకంగా అభివృద్ధి పరచాలని గత ప్రభుత్వం భావించి తగిన ప్రతిపాదనలు చేస్తే.. వైసీపీ ప్రభుత్వం ఆ ఊసే లేకుండా చేస్తోంది.

స్తంభాలబోడు



మట్టి తోడుతున్న ఎక్స్‌కవేటర్

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- చారిత్రాత్మక ఆనవాళ్లు మాయం
- రూపురేఖలు కోల్పోతున్న స్తంభాలబోడు
- ఎర్రమట్టి, రంగురాళ్ల తవ్వకాలతో అక్రమార్జన
- నాడు ఆధ్యాత్మికం.. నేడు అక్రమాలకు నిలయం

గురజాలటౌన్, పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18: గురజాల మండలం మాడుగుల శివారులోని స్తంభాలబోడుకు చారిత్రక ఆధారాలున్నాయి. బౌద్ధులు, జైనులు ఇక్కడ నడయాడినట్లు సాక్ష్యాలున్నాయి. ఆధ్యాత్మికతకు నిలయమైన ఈ స్తంభాలబోడుపై అధికారంలోకి రాగానే వైసీపీ నేతల కన్ను పడింది. సర్వే నంబరు 945బై14బీలో ఉన్న వంద ఎకరాల్లో ఎర్రమట్టిని తవ్వి అమ్ముకునేందుకు సిద్ధమయ్యారు. అనుకుందే తడవుగా కొద్దిపాటి భూమికి అనుమతులు తీసుకుని మరింత భూమిలో తవ్వకాలు జరిపారు. ఇక్కడ మట్టిని వెంచర్లకు, అపార్ట్‌మెంట్లకు తోలుతూ అక్రమార్జనకు తెరదీశారు. తదుపరి రెండేళ్లకే దాచేపల్లి - మాచర్ల హైవేకు అనుమతులు వచ్చాయి. అధికారం చేతిలో ఉండడంతో అధికారులను నోరు మెదపకుండా చేశారు. వందల టిప్పర్లతో మట్టిని లోడు చేస్తూ యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. పశువుల మేతకు అనుకూలంగా ఉన్న స్తంభాలబోడును ఆక్రమించిన నేతలు పశువులను సైతం దరిదాపులకు రానివ్వడం లేదు. ఎక్స్‌కవేటర్‌తో రేయింబవళ్లు మట్టిని, రాళ్లను తవ్వేసి ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు.

కేజీఎఫ్ తరహాలో మైనింగ్

మట్టి తవ్వకాల సమయంలో రంగురాళ్ల ఉనికి తెలుసుకున్నారు. నిర్ధారించుకునేందుకు పెద్ద పెద్ద స్కానర్లు తెప్పించి పరీక్షలు జరిపారు. దాచేపల్లి మండలం భట్రుపాలెం, గురజాల మండలం మాడుగుల తదితర ప్రాంతాలు ఎంతో విలువైన తెల్లరాయి(క్వార్ట్జ్‌రాయి)కి నెలవుగా ఉన్నట్లు గుర్తించారు. అధికారం అండతో కొందరు నేతలు బరితెగించి కేజీఎఫ్ తరహాలో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. అక్రమార్కులు గ్రావెల్‌తో పాటు తెల్లరాయిని తరలించేస్తున్నారు. రెండేళ్లుగా మట్టిని తరలిస్తున్నా అదేమిటని అడిగే వారే లేకపోవడంతో పేట్రేగిపోయిన కొందరు మట్టితో పాటు ఎంతో విలువైన తెల్లరాయిని సైతం అమ్మేసి డబ్బులు దండుకుంటున్నారు. తెల్లరాయికి గిరాకీ ఉండటంతో వ్యాపారులు కొందరితో గుట్టుగా చేతులు కలిపి రంగురాళ్ల తవ్వకాలకు, తరలింపునకు పాల్పడుతున్నా రనేది గ్రామస్తులు చెబుతున్నమాట. రాయికి ధర నిర్ణయించి లారీలతో ఎక్కడికి తరలిస్తున్నారో ఏ ఒక్కరికి అంతుపట్టడం లేదు. మాచవరం మండలం రేగులగడ్డ కృష్ణానది పరివాహక ప్రాంతంలోనూ సున్నపురాయిని తవ్వడం అప్పట్లో సంచలనం రేగింది. నదీ గర్భాన్ని సైతం ఆక్రమించి తవ్వకాలు జరపడాన్ని గుర్తించిన మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆ ప్రాంతాన్ని సందర్శించి వైసీపీ నేతల అక్రమ మైనింగ్ బండారాన్ని బయట పెట్టడంతో మొదట్లో అధికారులు అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పటమే కానీ వాటిని చూపేందుకు ముందడుగు వేయలేదు. గుట్టుగా నాటు పడవల సాయంతో మైనింగ్ ప్రాంతానికి వెళ్లిన అధికారులు అంతే గుట్టుగా కార్యాలయానికి చేరుకున్నారే తప్ప ఏ ఒక్కరిని విచారించిన దాఖలాలులేవు. అదేవిధంగా ఇప్పుడు మాడుగుల సమీపంలోని స్తంభాలబోడులోను ఎంతో విలువైన తెల్లరాయి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలిపోతుందని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శని వారం తెల్లరాయి తవ్వకాలు జరుపుతున్న ప్రదేశాన్ని ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఆ ప్రదేశాన్ని సందర్శించిన సమయంలో ఎక్స్‌కవేటర్‌ను వదిలివెళ్లారు. దీనినిబట్టి అనుమతులు ఉంటే వారెందుకు భయపడుతున్నారో తెలియడంలేదని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతల ధనదాహంతో ప్రకృతి సంపదను కూడా దోచేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పరచాలని ప్రతిపాదించగా వైసీపీ మాత్రం అక్రమాలకు అడ్డాగా మార్చిందంటూ మండిపడ్డారు.



మాడుగుల వద్ద వైసీపీ నేతల ఆధ్వర్యంలో నడుస్తున్న క్వారీలో క్వార్ట్జ్ రాయి నిల్వలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు (పాతచిత్రం)





స్తంభాల బోడులో మైనింగ్ జరిగిన ప్రాంతం



టిప్పర్లతో మట్టి తరలిస్తున్న దృశ్యం

పిల్లుట్ల పెద్దచెరువులో తవ్వకాలు

- పేదల భూములపై కన్నేసిన వైసీపీ నాయకులు
- నాడు యరపతినేని అడ్డుకోగా.. నేడు అక్రమార్జనకు శ్రీకారం
- గ్రామస్తులు అడ్డుకోవడంతో వెనుతిరిగిన అక్రమార్కులు

మాచవరం, ఫిబ్రవరి 18: మాచవరం మండలం పిల్లుట్ల శివారు పెద్దచెరువు భూములను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. స్థానిక వైసీపీ నాయకులు చెరువు భూములపై కన్నేశారు. అక్రమంగా మట్టి తవ్వకాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. అయితే స్థానిక వాహనదారులు వారి అక్రమాలకు సహకరించలేదు. దీంతో తుళ్లూరు నుంచి ఎక్స్‌కవేటర్, టిప్పర్లు తీసుకొచ్చి మట్టి తవ్వకాలకు పూనుకున్నారు. యరపతినేని శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సదరు భూముల్లో మైనింగ్ అనుమతులు తీసుకుని మట్టి తవ్వకాలకు ప్రయత్నించగా ఆయన అడ్డుకున్నారు. సాగు భూములు పాడైపోతాయని అప్పట్లో తవ్వకాలను నిలిపివేశారు. అప్పట్లో యరపతినేని పేదల కోసం ప్రయత్నం చేస్తే ప్రస్తుతం వైసీపీ నాయకులు అక్రమ సంపాదనకు తెరలేపారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెద్ద చెరువులోని నల్లమట్టిని శ్రీరుక్మిణీపురం, పిల్లుట్ల గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు టిప్పర్ల ద్వారా రైతుల పొలాలకు తోలి అక్రమ సంపాదనకు పూనుకున్నారు. ఇది తెలిసిన పిల్లుట్ల గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో మట్టి తవ్వకందారులు చేసేదిలేక వాహనాలను తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

చర్యలు తీసుకుంటాం

పెద్దచెరువులో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. తవ్వకాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. - రామకృష్ణ, తహసీల్దారు

పనులు.. పడక



నరసరావుపేట మార్కెట్ యార్డులో నిలిచిపోయిన శీతల గిడ్డంగి నిర్మాణం

పెదచెరువులో నిలిచిపోయిన సద్భావ్ భవన నిర్మాణం

ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయ భవన నిర్మాణం

- ఐదేళ్లుగా సాగని నిర్మాణాలు
- నిధులు నిలిపివేసిన ప్రభుత్వం
- అసంపూర్తిగా పలు భవన నిర్మాణాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధులు కొరత.. పాలకుల నిర్లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రగతి పనులు ముందుకు సాగడంలేదు. నిధుల కొరతతో పనులను సాగదీస్తున్నారు. దాదాపు ఐదేళ్లుగా ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పూర్తి చేయలేక చతికిల పడింది. రైతులు, పేద విద్యార్థులు, ముస్లింల ప్రయోజనాల కోసం రూ.కోట్లతో చేపట్టిన పనులను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. శీతల గిడ్డంగి, సద్భావ్ భవనం, ముస్లిం మైనార్టీ, గిరిజన విద్యార్థుల గురుకుల పాఠశాల నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఆయా పనులపై దృష్టి సారించకపోవడం గమనార్హం.

నరసరావుపేట మార్కెట్ యార్డులో మిరప రైతుల ప్రయోజనాల కోసం టీడీపీ ప్రభుత్వం రూ.5 కోట్లతో శీతల గిడ్డంగి నిర్మాణం చేపట్టింది. పునాదుల వరకు పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పనులను నిలిపివేసింది. రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న పాలకులు శీతల గిడ్డంగి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఏమీ కనిపించడంలేదు. మిరప రైతులకు ఉపయోగపడే కట్టడాన్ని నిలిపివేయడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు పండించే మిరప పంటను గుంటూరు తరలించి అక్కడి శీతల గిడ్డంగులలో నిల్వ చేసుకుంటున్నారు. ఇందుకు ఎన్నో వ్యయప్రయాసలకు గురవుతున్నారు. అయినా ఇక్కడ పనులను పూర్తి చేయాలన్న ఆలోచనలో పాలకులు, అధికారులు లేరు.

నరసరావుపేట మండలం పెదతురకపాలెంలో గిరిజన బాల, బాలికల గురుకుల పాఠశాల నిర్మాణం చేపట్టారు. రూ.8.2 కోట్లతో బాలుర గురుకుల పాఠశాల, రూ.9.60 కోట్లతో బాలికల పాఠశాల భవనాల నిర్మాణాలను చేపట్టారు. బాలికలకు సంబంధించిన వసతి గృహాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ 23వ స్కీమ్ కింద రూ.1.40 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో చేపట్టిన బాలికల గురుకుల పాఠశాల, వసతి గృహాల నిర్మాణం పూర్తైంది. బాలుర వసతి గృహాలు, బాలుర స్కూల్ భవనాల నిర్మాణం నిలిచిపోయింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా ఆపేశారు. గిరిజన సంక్షేమ శాఖ నిధుల విడుదల కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం లేదు. నిధుల విడుదలను ప్రభుత్వం విస్మరించింది. ఈ రెండు పాఠశాలలు పూర్తి చేస్తే జిల్లాలోని వందలాది మంది విద్యార్థులకు మెరుగైన విద్య, వసతి అందుబాటులోకి వస్తుంది. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు.

ముస్లిం మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం పెదతురకపాలెంలో రెసిడెన్షియల్ స్కూల్‌ను గత ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.15 కోట్లతో తరగతి గదులు, వసతిగృహం, స్టాఫ్ క్వార్టర్స్ పనులు చేపట్టగా 40 శాతం మాత్రమే పూర్తయ్యాయి. పూర్తయిన పనుల విలువ సుమారు రూ.6.50 కోట్లు ఉంటుంది. పనులు ఏపీ ఈడబ్ల్యూఐడీసీ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. అయితే బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులను నిలిపివేశారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం పూర్తి చేయడాన్ని విస్మరించింది.



పెదతురకపాలెంలో నిలిచిపోయిన ముస్లిం గురుకుల పాఠశాల భవనాలు

నరసరావుపేట పెదచెరువులోని కలెక్టర్ బంగళా వెనుక అల్ప సంఖ్యాకుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బహుళ ఉపయోగార్థం రూ.1.43 కోట్లతో సద్భావ్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌డీపీ కింద 60 శాతం నిధులను 2018లో విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంది. శ్లాబ్ స్థాయి వరకు పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదలను విస్మరించడంతో పనులు నిలిచిపోయాయి.

ఆర్‌అండ్‌బీ శాఖ నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టింది. ప్రస్తుతం కార్యాలయం ఉన్న ప్రాంగణంలోనే కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆర్‌యూబీ నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ స్థలాన్ని తీసుకున్నారు. అందుకు మున్సిపాల్టీ 2018లో రూ.25 లక్షలు ఆర్‌అండ్‌బీకి చెల్లించింది. ఈ నిధులతో భవనం నిర్మాణం చేపట్టారు. అయితే నిధుల కొరతతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఎస్సీ కార్యాలయం ఇక్కడే ఏర్పాటు చేయడంతో కనీస వసతులు లేక పాత భవనంలోనే అధికారులు, ఉద్యోగులు విధుల నిర్వహణకు ఇక్కట్లు పడుతున్నారు.

ఇసుక తవ్వకాలపై.. నిరసన

- గుండిమెడ క్వారీలో భారీ గోతుల గుర్తింపు
- టీడీపీ, జనసేన నేతల రాకతో పొదల్లోకి యంత్రాలు

తాడేపల్లి, ఫిబ్రవరి 18: ఐదేళ్లలో 50 కోట్ల టన్నుల ఇసుకను బొక్కేశారు.. అక్రమ తవ్వకాలతో గుంతలు ఏర్పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు.. అంటూ అక్రమ ఇసుక తవ్వకాలపై తాడేపల్లి మండలం గుండిమెడ ఇసుక క్వారీలో ఆదివారం టీడీపీ, జనసేన నేతలు నిరసన తెలిపారు. క్వారీలో భారీగా తవ్వేసిన గుంతలను, ఇసుక అక్రమ నిల్వలను పరిశీలించారు. నేతల రాక సమాచారంతో ఎక్స్‌కవేటర్, లారీలను, ట్రాక్టర్‌లను నిర్వాహకులు ముళ్లపొదల్లో దాచేశారు. అయినా వాటిలో కొన్నింటిని టీడీపీ జనసేన నేతలు గుర్తించారు. కృష్ణానదిలో సుమారు 5 కిలోమీటర్ల పొడవున ఇసుక అక్రమ తవ్వకాలను వారు పరిశీలించారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని, ఇసుక దొంగలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త నందం అబద్దయ్య, అమరా సుబ్బారావు, కొమ్మారెడ్డి కిరణ్, జనసేన నేత సామల నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు.టీడీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.1000కి దొరికితే నేడు అది రూ.5 వేలైందన్నారు. అధికారులు ఎందుకు నిద్ర నటిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, వల్లభనేని వెంకట్రావు, కేశంనేని శ్రీ అనిత, కొల్లి శేషు, కాట్రగడ్డ మధు, గోవాడ దుర్గారావు, కొల్లి సురేష్, విన్నకోట శ్రీనివాస్, అన్నెం కుసుమ, వీరిశెట్టి శ్రీనివాస్, బుల్లిబాబు, ఈపూరి కోటయ్య, చిగురుపాటి సుబ్బారావు, కంచర్ల రంగారావు, ఓలేటి రాము, కేళి వెంకటేశ్వరరావు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.




ఇసుక క్వారీలో భారీ గుంత వద్ద టీడీపీ జనసేన నేతలు

దిక్సూచి DIKSUCHI

భారతదేశంలోనే ఉన్నత ఉద్యోగాలైన ఐఏఎస్, ఐపీఎస్ తదితర కీలక సర్వీసులకి సంబంధించి 1056 పోస్టులకుగాను సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్‌ను యూపీఎస్సీ విడుదల చేసింది. నిర్ణీత వయోపరిమితి, బ్యాచిలర్స్ డిగ్రీ ఉన్న అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. జనరల్ అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి 32 సంవత్సరాలు. ఆరు సార్లు ఈ పరీక్ష రాయవచ్చు. రిజర్వుడు వర్గాలకు వయస్సు, అటెంప్టుల విషయంలో నిబంధనల మేరకు సడలింపు ఉంటుంది.

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రిపరేషన్

తొలి మెట్టు నుంచే పట్టు సాధించాలి



సివిల్ సర్వీసెస్ పరీక్షను మూడు అంచెలలో నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల ద్వారా నిర్వహణ ప్రక్రియ ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్ష ఈ ఏడాది మే 26న నిర్వహిస్తున్నారు.

మెయిన్స్‌కు నిగ్గుతేల్చే పరీక్ష

ప్రిలిమినరీ(ప్రాథమిక) పరీక్షను అర్హత పరీక్షగానే పరిగణించాలి. ఈ మార్కులను మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు మాత్రమే పరగణనలోకి తీసుకుంటారు. ఇది ఆబ్జెక్టివ్ రూపంలో నిర్వహించే పరీక్ష. ప్రిలిమినరీ పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కొక్క పేపరు 200 మార్కులకి ఉంటుంది. ఇందులో నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. అందువల్ల విద్యార్థి జాగ్రత్తగా వ్యవహరించాలి. మొదటి పేపర్ జనరల్ స్టడీస్‌కి సంబంధించింది. దీనిలో 100 ప్రశ్నలకు 200 మార్కులు ఉంటాయి. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా మెయిన్స్ పరీక్షకి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్టడీస్

ప్రధానంగా భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, భారతదేశ - ప్రపంచ భౌగోళిక శాస్త్ర అంశాలు; పాలిటీలో భారత రాజ్యాంగం, పరిపాలన, పంచాయతీ రాజ్ వ్యవస్థ; ఎకానమీలో సుస్థిరాభివృద్ధి, పేదరికం, బడ్జెట్, ద్రవ్య విధానం - కోశ విధానం; సైన్స్ అండ్ టెక్నాలజీలో స్పేస్ టెక్నాలజీ, ఐటీ, రోబోటిక్స్, డిఫెన్స్, కమ్యూనికేషన్స్‌కు తోడు వర్తమాన అభివృద్ధి; పర్యావరణంలో సంబంధిత అంశాలు, జనరల్ సైన్స్ అలాగే వర్తమాన జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.

గత సంవత్సరం(2023) పరీక్ష పేపరును పరిశీలిస్తే సబ్జెక్టుల వారీగా మార్కులు ఇలా ఉన్నాయి.

- చరిత్ర(14)
- జాగ్రఫీ(16)
- పాలిటీ(15)
- ఎకానమీ(14)
- పర్యావరణం(14)
- కరెంట్ అఫైర్స్(15)
- సైన్స్ అండ్ టెక్నాలజీ(12)

చరిత్ర

చరిత్రకు సంబంధించి 2012 నుంచి 2023 వరకు ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే అత్యల్పంగా 2017, 2023లలో 14; అత్యధికంగా 2014లో 22 ప్రశ్నలు వచ్చాయి. చరిత్రలో ప్రాచీన, మధ్య యుగ ఆధునిక భారతదేశ చరిత్రతోపాటు కళలు - సంస్కృతి (ఆర్ట్ అండ్ కల్చర్)కి సంబంధించిన ప్రశ్నలు వస్తాయి. చరిత్ర విషయంలో ప్రాథమిక అంశాలు బాగా చదవాలి. 75 వసంతాల భారతదేశంలో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'పై తప్పనిసరిగా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ప్రాచీన భారత చరిత్ర విషయానికి వస్తే ముఖ్యంగా ఇటీవలి కాలంలో సింధు నాగరికతకి సంబంధించిన కట్టడాలు తవ్వకాలలో బయటపడ్డాయి. దీనికి సంబంధించి ప్రశ్న వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత తవ్వకాలలో బయల్పడిన కట్టడం గురించి అయినా అడగవచ్చు లేదా సింధు నాగరికత పట్టణాలకి సంబంధించి ఏ అంశం అయినా అడగవచ్చు. అందువల్ల ఈ విషయంలో పూర్తిగా చదివితే పరీక్షలో సులభంగా సమాధానాన్ని గుర్తించవచ్చు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, దయానంద సరస్వతి వంటి ప్రముఖలపై ఇటీవలి కాలంలో దిన పత్రికలలో వార్తలు బాగా వస్తున్నాయి. వీరిపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

చరిత్ర కోసం 6, 7, 8, 12వ తరగతి నూతన ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతోపాటు ప్రాచీన భారతదేశ చరిత్ర(ఆర్.ఎస్. శర్మ), మధ్యయుగ భారతదేశ చరిత్ర(సతీష్ చంద్ర), ఆధునిక భారతదేశ చరిత్ర(బిపిన్ చంద్ర), స్వాతంత్ర్యోద్యమ చరిత్ర(బిపిన్ చంద్ర) పుస్తకాలు చదివితే సబ్జెక్టుపై సమగ్ర అవగాహన వస్తుంది. ఇవి చదివితే 60 నుంచి 70 శాతం మార్కులు సాధించినట్లే. వీటితోపాటు టాటా మెగ్రాహిల్, స్పెక్ట్రమ్, సివిల్ సర్వీసెస్ క్రానికల్ వంటి సంస్థలకి సంబంధించి ఏదైనా ఒక స్టాండర్డ్ పుస్తకాన్ని ఆసాంతం చదివితే సరిపోతుంది.

2023లో చరిత్ర నుంచి అడిగిన ప్రశ్నలు (ఉదాహరణకు):

- **మహాసాంఘిక అధ్వర్యంలో, ప్రముఖ బౌద్ధ కేంద్రంగా విలసిల్లిన ధాన్యకటకం కింది ప్రాంతాల్లో ఎక్కడ ఉంది?**
  ఎ) ఆంధ్ర బి) గాంధార సి) కళింగ డి) మగధ
- **ప్రాచీన దక్షిణ భారతదేశానికి సంబంధించి, కోర్కై, పూంపుహార్, ముచిరి అనేవి ఏ విధంగా ప్రసిద్ధి చెందాయి?**
  ఎ) రాజధాని నగరాలు బి) ఓడరేవులు
  సి) ఇనుము-ఉక్కు తయారీ కేంద్రాలు
  డి) జైన తీర్థంకరుల పుణ్యక్షేత్రాలు

కటాఫ్

2022 ప్రిలిమ్స్ పేపర్ కట్ ఆఫ్ మార్కులు పరిశీలిస్తే 200 మార్కులకిగాను జనరల్ అభ్యర్థులు 88.22 మార్కులు, ఈడబ్ల్యుఎస్ -82.83, ఓబీసీ-87.54, ఎస్సీ-74.08, ఎస్టీ-69.35, దివ్యాంగుల కేటగిరి 1 - 49.84, కేటగిరి 2 - 58.59, కేటగిరి 3 - 40.40, కేటగిరి5 - 41.76 వచ్చాయి. ఈ మార్కులకి అటు ఇటుగా 5 మార్కులు అంచనా వేసుకుని ముందస్తు ప్రణాళిక చేసుకుంటే ఎవరికైనా మెయిన్స్‌కు మార్గం సుగమం అవుతుంది.

జాగ్రఫీ



దీనిలో అత్యల్పంగా 2016లో 7 ప్రశ్నలు రాగా, అత్యధికంగా 2013లో 18 ప్రశ్నలు వచ్చాయి. జాగ్రఫీలో భారతదేశ భౌగోళిక పరిస్థితులేగాక ప్రపంచ భౌగోళానికి సంబంధించిన అంశాలను చదవాలి. అయితే భౌతిక భౌగోళిక అంశాలపై ప్రధానంగా ప్రశ్నలు వస్తాయి. ఉదాహరణకి టోంగా అగ్నిపర్వతం గురించి ఇటీవల వార్తలు వచ్చాయి. టోంగా అగ్నిపర్వతం గురించి ప్రత్యేకంగా చదవాలి. అదే సమయంలో అగ్నిపర్వతం(ఓల్కనో) రకాలు, అవి ఏర్పడటానికి కారణాలు, ఎక్కడెక్కడ ఉన్నాయి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇటీవలి కాలంలో తరచూ నదుల అనుసంధానం ప్రస్తావన వచ్చింది. కెన్-బెట్వా అనుసంధానం గురించి చదవాలి. అలాగే నదులు, వాటి ఉపనదులను మ్యాప్ సహాయంతో నేర్చుకోవాలి. ఫారెస్ట్ రిపోర్ట్ 2021 ప్రకారం అడవుల విస్తీర్ణం పెరిగింది. అడవుల రకాలు,

విస్తీర్ణం ఏ రాష్ట్రాలలో ఏవిధంగా ఉంది సమగ్రంగా చదవాలి. మడ అడవులను అధ్యయనం చేయాలి. ఇండియాకి సంబంధించి రామ్సర్ సైట్స్ 80కి చేరాయి. చిత్తడి నేలలు అంటే ఏమిటో, ఎక్కడెక్కడ ఉన్నాయో చదువుకోవాలి. ప్రతి సంవత్సరం ఏదైనా ఒక సముద్రం సరిహద్దులను పరీక్షలో ఇస్తున్నారు. ఈ సంవత్సరం నల్లసముద్రం, ఎర్ర సముద్రం తరచూ వార్తల్లో నిలిచాయి. వాటి చుట్టుపక్కల ప్రాంతాలు, జలసంధులపై ప్రశ్నలు అడగవచ్చు. వార్తల్లో నిలిచిన వివాదాస్పద ప్రాంతాలు పాలస్తీనా - ఇజ్రాయెల్; నగోర్నో కారాబాగ్, హెల్మండ్ నది వివాదం వంటివి పరిశీలించండి. వివిధ దేశాల సరిహద్దులు, సమగ్ర సరిహద్దులు మ్యాప్ పాయింటింగ్ ద్వారా చదువుకోవాలి. జాగ్రఫీకి సంబంధించి 6-12 ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్ బాగా చదివితే సరిపోతుంది. వీటితోపాటు ఏదైనా ఒక స్టాండర్డ్ బుక్ చదివితే మంచిది.

పాలిటీ

ఇందులో అంతర్జాతీయ అంశాలకు సంబంధించి అత్యల్పంగా 2016లో 7 ప్రశ్నలు, అత్యధికంగా 2017లో 22 ప్రశ్నలు వచ్చాయి. పాలిటీలో భారత రాజ్యాంగంలోని అంశాలకు వర్తమాన విషయాలు జోడించి చదవాలి. ఉదాహరణకు దేశంలో గవర్నర్ వ్యవస్థ వివాదాస్పదం అవుతోంది కాబట్టి దానిపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక, కొలిజియం వ్యవస్థ, కేంద్ర ఎన్నికల సంఘం-కమిషనర్ల నియామకం- సుప్రీం కోర్టు తీర్పు, ఎన్నికల సంస్కరణలు, ఎలక్టోరల్ బాండ్స్ - సుప్రీం తీర్పు, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్స్ - సుప్రీం కోర్టు తీర్పు, భారత రాజ్యాంగం, దానిలోని మౌలికాంశాలు, కేశవానంద భారతి కేసు వంటి వాటితో పాటు, రాజ్యాంగంలోని అంశాలు ఎక్కడ నుంచి తీసుకున్నారు వంటి అంశాలు చదవాలి. పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బిల్లుల గురించి చదవాలి. సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన వివిధ ముఖ్యమైన తీర్పులు చదవాలి. వివిధ కమిటీల రిపోర్ట్‌లు చదవాలి. 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, మహిళ వివాహ వయస్సుకి సంబంధించిన అంశాలతోపాటు వారికి సంబంధించిన హక్కులు చదవాలి. ఓబీసీ జాబితాకి చేసిన రాజ్యాంగ సవరణ బిల్లుతోపాటు ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రాజ్యాంగ ఆర్టికల్స్, వారికి సంబంధించిన కమిషన్ల గురించి చదవాలి.

2023లో పాలిటీలో అడిగిన ప్రశ్నలు (ఉదాహరణకు)

- **'డ్యూ ప్రాసెస్ ఆఫ్ లా' అంటే ఏమిటి?**
  ఎ) సహజ న్యాయ సూత్రం
  బి) చట్టం ద్వారా ఏర్పాటు చేసిన విధానం
  సి) న్యాయమైన చట్టం దరఖాస్తు
  డి) చట్టం ముందు సమానత్వం
- **కింది వాటిలో ఏది దేశ రాజ్యాంగం ముఖ్య ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తుంది?**
  ఎ) అవసరమైన చట్టాలను రూపొందించడానికి ఇది లక్ష్యాన్ని నిర్ణయిస్తుంది. బి) ఇది రాజకీయ కార్యాలయాలు, ప్రభుత్వాన్ని సృష్టించడానికి వీలు కల్పిస్తుంది.
  సి) ఇది ప్రభుత్వ అధికారాలను నిర్వచిస్తుంది, పరిమితం చేస్తుంది.
  డి) ఇది సామాజిక న్యాయం, సామాజిక సమానత్వం, సామాజిక భద్రతను కల్పిస్తుంది.

పాలిటీ విషయంలో ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురించిన ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ వర్క్ అనే 11వ తరగతి పుస్తకం చదవాలి. ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ పుస్తకంతో పాటు లక్ష్మీకాంత్ ఇండియన్ పాలిటీ లాంటి స్టాండర్డ్ బుక్ ఏదైనా ఒకటి చదవాలి. పాలిటీ చదివేటప్పుడు ముఖ్యంగా వర్తమాన అంశాలు కలుపుకొని బాగా చదవాలి. రాజ్యాంగ ప్రకరణలపై అవగాహన రావాలి.

సిశాట్

ప్రిలిమ్స్‌లో రెండో పేపర్ సిశాట్ 200 మార్కులకిగాను 80 ప్రశ్నలతో నిర్వహిస్తారు. ఈ పేపర్ క్వాలిఫైయింగ్ పేపర్ మాత్రమే. ఈ పేపర్‌లో 33 శాతం మార్కులు సాధించాలి.

ఈ పేపర్‌లో సాధారణ న్యూమరసీ, అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, గ్రాఫ్స్, టేబుల్స్‌కి సంబంధించి పదో తరగతి పరిజ్ఞానం సరిపోతుంది. ఇంగ్లిష్ ప్యాసేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి.

రీజనింగ్, అర్థమెటిక్‌కు సంబంధించి చాంద్ బుక్స్ లేదా, అరిహంట్ బుక్స్ గానీ చదవాలి. ఇంగ్లిష్ పాసేజ్‌కి సంబంధించి టాటా మెగ్రాహిల్ లేదా అరిహంట్ లేదా పియర్సన్ బుక్స్ చదవాలి.

ప్రిలిమినరీ పరీక్షకి చదువుతూనే మెయిన్స్ సంబంధించి కూడా చరిత్ర, భౌగోళిక శాస్త్రం, ఎకానమీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, పాలిటీలను అనుసంధానం చేసుకుంటూ వెళ్ళాలి. తద్వారా మెయిన్స్‌కి ప్రిలిమ్స్ తరవాత చదవడం కూడా సులభతరమవుతుంది.

జనరల్ సైన్స్

శాస్త్ర సాంకేతికతకి సంబంధించి 2019లో 7 అత్యల్పంగా, 2014లో అత్యధికంగా 16 ప్రశ్నలు వచ్చాయి. జనరల్ సైన్స్‌లో వ్యాధులు, విటమిన్‌లు, వృక్ష, జంతువులకి చెందిన సాధారణ అంశాలు ముఖ్యం. సైన్స్ అండ్ టెక్నాలజీలో కమ్యూనికేషన్స్, స్పేస్, ఐటీ, రోబోటిక్స్ బయోటెక్నాలజీ, డిఫెన్స్ వంటి అంశాల్లో నూతన ఆవిష్కరణలు, సమకాలీన డెవలప్‌మెంట్స్ పైన ప్రశ్నలు అధికంగా వస్తాయి. ఇటీవలి కాలంలో భారత దేశంతోపాటు ఇతర దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఈసారి చంద్రయాన్-3, ఆదిత్య ఎల్1 ప్రయోగం తదితరాలపై కచ్చితంగా చదవాలి. వార్తల్లో నిలిచిన వ్యాధులు - సంక్రమణ, నివారణ చర్యల గురించి చదవాలి.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

(మిగతా రేపటి దిక్సూచిలో)

22,400 పైన క్లోజయితే బుల్లిష్

(ఫిబ్రవరి 19-23 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,069-21,530 పాయింట్ల మధ్యన కదలాడి లాభంతో చివరకు 22,041 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 30, 50, 150, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,692, 21,544, 20,261, 19,855 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,450
బ్రేక్‌డౌన్ స్థాయి: 21,650
నిరోధ స్థాయిలు: 22,250, 22,350, 22,450 (22,150 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,850, 21,750, 21,650 (21,950 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	554	విజయవాడ	542
19వ తేదీ		విశాఖపట్నం	555
చిత్తూరు	603	వరంగల్	556
గోదావరి	542	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	134
వరంగల్	130	గుంటూరు	135
కరీంనగర్	130	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	135
కర్నూలు	130	నెల్లూరు	135
విశాఖపట్నం	122	అనంతపురం	134
గోదావరి	134		

ప్రభుత్వ పెట్టుబడులే చాలవు

- ప్రైవేట్ పెట్టుబడులూ పెరగాలి
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సుబ్బారావు



న్యూఢిల్లీ: ప్రైవేట్ పెట్టుబడులు ఇంకా పుంజుకోకపోవడంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెట్టుబడులకు ప్రైవేట్ పెట్టుబడులు కూడా తోడైతేనే 6.5 శాతం నుంచి 7 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధ్యమవుతుందని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. 'ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై పెట్టుబడి పెట్టడం సానుకూల అంశమే. ఇది ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాల వృద్ధికి దోహదం చేస్తుంది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరం కల్లా ద్రవ్య లోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయాలంటే ఈ స్థాయిలో ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగించడం కష్టమవుతుంది' అన్నారు. ప్రైవేట్ పెట్టుబడులతో పాటు ప్రస్తుతం వినియోగం, ఎగుమతుల అవకాశాలూ అంతంత మాత్రంగానే ఉన్నట్టు సుబ్బారావు చెప్పారు.

చాయిస్‌లు తక్కువే: ప్రభుత్వ పెట్టుబడులు తగ్గించేందుకు ప్రభుత్వం ముందున్న చాయిస్‌లూ తక్కువేనని సుబ్బారావు చెప్పారు. ఒకవేళ ముందు ముందు కూడా ప్రభుత్వ పెట్టుబడులు ఇదే స్థాయిలో కొనసాగించాలంటే ఇతర ఖర్చులైనా తగ్గించుకోవాలి లేదా అప్పులైనా తేవాల్సి ఉంటుందన్నారు. స్వల్పకాలంలో ఇతర ఖర్చులు తగ్గించుకుంటే ఇతర సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని అప్పుల తెచ్చి ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగించాలంటే ఎఫ్‌ఆర్‌బీఎం లక్ష్యాలు దెబ్బతింటాయన్నారు.

వృద్ధిలో అసమతౌల్యం: ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నా, సగం జనాభా ఆదాయాలు అంతంత మాత్రంగానే ఉన్న విషయాన్ని సుబ్బారావు గుర్తు చేశారు. అభివృద్ధి ఫలాలు వీరికి కూడా చేరితే తప్ప వినియోగం పుంజుకోదన్నారు. వీరి ఆదాయం, వినియోగ ఖర్చులు పెరిగితే ప్రైవేట్ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలూ పెరుగుతాయన్నారు. దేశీయ వినియోగ పరిశ్రమ ప్రస్తుతం తన ఉత్పత్తి సామర్థ్యంలో 75 శాతం వినియోగించుకుంటోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు పెట్టుబడులు లోక్‌సభ ఎన్నికల తర్వాత పుంజుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

ఉచితాలు సరికాదు

ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు పోటీ పడి ఇస్తున్న 'ఉచిత హామీ'లపై సుబ్బారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉచితాలపై చేసే ఖర్చులను ప్రజలకు విద్య, ఆరోగ్యం లేదా మౌలిక వసతుల కల్పనపై చేయడం మంచిదన్నారు. ఈ రంగాలపై చేసే ఖర్చులు దీర్ఘకాలంతో దేశ అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. ఓటర్లు కూడా ఉచితాల హేతుబద్ధతను ఆలోచించి ఓటేయ్యాలని కోరారు.

ఈ వృద్ధి రేటు చాలదు

2047 నాటికి మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే ప్రస్తుత వృద్ధి రేటు చాలదని సుబ్బారావు స్పష్టం చేశారు. వచ్చే 20 ఏళ్ల పాటు ఏటా సగటున 7.6 శాతం చొప్పున అభివృద్ధి చెందితేనే ఆ లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. వాతావరణ మార్పులు, ప్రపంచీకరణపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత, పెరిగిపోతున్న వృద్ధులు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఇందుకు ఆటంకంగా మారే ప్రమాదం ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) కూడా ఇందుకు ప్రతిబంధకం కావచ్చని చెప్పారు. మన దేశ అభివృద్ధి ప్రపంచ అభివృద్ధితో ముడిపడి ఉందనే విషయాన్ని మర్చిపోకూడదన్నారు. ప్రపంచ అభివృద్ధి క్షీణిస్తుంటే, మన దేశం అభివృద్ధిలో పయనిస్తుందని భావించడం వృథా ప్రయాస అని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ స్పష్టం చేశారు.

బిజినెస్



త్వరలో రెండు సెమీకండక్టర్ ప్లాంట్లు

- రూ.వేల కోట్ల పెట్టుబడులు
- కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ: మన దేశంలో త్వరలో రెండు పూర్తి స్థాయి సెమీకండక్టర్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ విషయం వెల్లడించారు. ఇందులో ఒక ప్లాంట్‌ను ఇజ్రాయెల్ కేంద్రంగా పని చేసే 'టవర్ సెమీకండక్టర్' కంపెనీ, రెండో ప్లాంట్‌ను టాటా గ్రూప్ ఏర్పాటు చేస్తాయన్నారు. ఈ రెండు ప్లాంట్ల కోసం ఇజ్రాయెల్ కంపెనీ, టాటా గ్రూప్ రూ.వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు చెప్పారు. ఇజ్రాయెల్ కంపెనీ పెట్టుబడులే 800 కోట్ల డాలర్ల (సుమారు రూ.66,400 కోట్లు) వరకు ఉంటుందని చంద్రశేఖర్ తెలిపారు. ఈ రెండు ప్లాంట్లకు అనుబంధంగా అనే చిప్ అసెంబ్లింగ్, ప్యాకేజింగ్ యూనిట్లూ ఏర్పాటవుతాయన్నారు

జూన్‌లోగా అనుమతులు : టవర్ సెమీకండక్టర్, టాటా గ్రూప్ ఇందుకు అవసరమైన అనుమతుల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేశాయి. వీలైనంత త్వరలో ఈ రెండు ప్రతిపాదనలకు ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల్లోపు ఆమోదం తెలుపుతుందని చంద్రశేఖర్ చెప్పారు. ఒకవేళ ఈ లోపు కుదరకపోయినా లోక్‌సభ ఎన్నికల తర్వాత జూన్‌లోపు అన్ని అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఇజ్రాయెల్, టాటా గ్రూప్ ఏర్పాటు చేసే రెండు సెమీకండక్టర్ ప్లాంట్లలో 65, 40, 28 నానోమీటర్ చిప్స్ తయారవుతాయన్నారు.

- గీతమ్ యూనివర్సిటీ.. ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ ఇనిస్టిట్యూషన్స్ నుంచి రూ.28.87 కోట్ల నిధులను అందుకుంది. నిధులు మంజూరు చేసిన సంస్థల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐసీఎస్ఎస్ఆర్, కేంద్రవిద్యా శాఖ, యూజీసీ-డీఏఈ-సీఎస్ఆర్ తదితర సంస్థలు ఉన్నాయి. గిరిజన సాధికారిత-అనుభవిక పరిశోధన, సైంటిఫిక్ అడ్వాన్స్‌మెంట్, ఇంజనీరింగ్‌లో ఇన్నోవేషన్, అకాడమియా-పారిశ్రామిక రంగ భాగస్వామ్యం వంటి విభాగాల్లో పరిశోధన సహా ఇతరత్రా కార్యకలాపాల కోసం ఈ నిధులను మంజూరు చేశాయి.

- అమెజాన్ ఫ్రెష్.. వేగన్ స్టోర్‌ను ప్రారంభించింది. భారత్‌లో రోజురోజుకు శాఖాహారుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతోందని, వారి అవసరాలకు తగ్గట్టుగా ఈ స్టోర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ స్టోర్‌లో పలు రకాలైన ప్లాంట్ ఆధారిత ఉత్పత్తులతో పాటు రెడీ టు యూజ్ ప్రొడక్ట్స్ ఉన్నట్లు తెలిపింది. సో గుడ్, సోఫిట్, ఎపిగమియా, ఆర్‌ఏడబ్ల్యూ వంటి బ్రాండ్స్.. అమెజాన్ ఫ్రెష్‌లో అందుబాటులో ఉన్నాయి.

ఫార్మా, మెటల్ షేర్లపై కన్నేయండి..!

స్టాక్ రికమండేషన్స్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మరింత కన్సాలిడేషన్‌కు గురికావచ్చు. గత వారం వరుసగా నాలుగు సెషన్లు సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలతో పాటు రిలయన్స్, ఎల్ అండ్ టీ వంటి షేర్లు పెరగటమే ఇందుకు కారణం. దీంతోపాటు ఆటో, బ్యాంకింగ్, ఐటీ రంగాల నుంచి మంచి తోడ్పాటు లభించింది. ఈ వారం ఫార్మా, మెటల్ రంగాల్లో మూమెంటమ్ ఉండే అవకాశం ఉంది. నిఫ్టీ ఫిబ్రవరి ఫ్యూచర్స్ మద్దతు స్థాయిలు 21,900, నిరోధ స్థాయిలు 22,150 వద్ద ఉన్నాయి. నిఫ్టీ 22,200 స్థాయిని అధిగమిస్తేనే బుల్లిష్‌నెస్ వస్తుంది.

పాలీక్యాబ్ ఇండియా: ఈ ఏడాది ఆరంభంలో ఒక్కసారిగా పతనమైన ఈ షేరు ప్రస్తుతం నిలదొక్కుకుంది. షేర్ల కదలికల్లో స్థిరత్వం వచ్చింది. మూడో త్రైమాసిక ఫలితాల తర్వాత స్వల్ప కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.4,670 వద్ద క్లోజైంది. ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.4,600/4,650 శ్రేణిలో ప్రవేశించి రూ.5,000/5,250 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,550 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆల్కెమ్ లేబొరేటరీస్: కొన్ని నెలలుగా ఈ కౌంటర్ జోరు ప్రదర్శిస్తూ వస్తోంది. త్రైమాసిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటం, డివిడెండ్ ప్రకటించటంతో ఈ నెల మొదటి వారం నుంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.5,442 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.5,400 ఎగువన ప్రవేశించి రూ.5,770/5,800 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవచ్చు. అయితే రూ.5,340 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా కమ్యూనికేషన్స్: గత చివరి నాలుగు సెషన్లలో ఈ షేరు లాభాల్లోనే ముగిసింది. త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ కౌంటర్‌లో కొనుగోళ్లు పెరిగాయి. గత శుక్రవారం రూ.1,812 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మూమెంటమ్ ట్రేడర్లు రూ.1,775/1,800 శ్రేణిలో ప్రవేశించి రూ.1,945/2,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: సుదీర్ఘ అప్‌ట్రెండ్ అనంతరం ఈ కౌంటర్ స్వల్ప దిద్దుబాటుకు లోనైంది. త్రైమాసిక ఫలితాల తర్వాత ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.1,508 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,475/1,500 శ్రేణిలో ప్రవేశించి రూ.1,650/1,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,450 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టీవీఎస్ మోటార్స్: రెండేళ్లుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు తాజాగా సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. రెండు నెలలుగా రూ.1,950 స్థాయిలో కన్సాలిడేషన్ జరిగింది. గత శుక్రవారం ఈ షేరు రూ.2,138 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,100 శ్రేణిలో ప్రవేశించి రూ.2,350/2,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,050 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక నిరోధ సాయిల్లో పరీక్ష



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కరెక్షన్‌తో ప్రారంభమై ఆ తర్వాత రికవరీ సాధించి తదుపరి 21,500 ఎగువకు వెళ్లింది. చివరకు 22,000 పాయింట్లకు స్వల్ప ఎగువన క్లోజైంది. గత వారం నిఫ్టీ ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలైన 22,150 పాయింట్ల చేరువలోకి వెళ్లింది. ఈ స్థాయిల వద్ద నిఫ్టీ పరీక్షను ఎదుర్కొనటం ఇది మూడో సారి. టెక్నికల్‌గా చూస్తే ప్రధాన నిరోధ స్థాయిల వద్ద ఎలాంటి అప్‌సైడ్ బ్రేకౌట్‌ను సూచించటం లేదు. గత శుక్రవారం అమెరికా మార్కెట్లు మైనర్ రియాక్షన్‌ను చవిచూడటంతో భారత మార్కెట్లు అప్రమత్త ట్రెండ్‌ను సూచించే అవకాశం ఉంది. ప్రధాన నిరోధ స్థాయిల వద్ద కొద్ది రోజుల పాటు నిలదొక్కుకుంటేనే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుందో లేదో తెలుస్తుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 22,150 ఎగువన తదుపరి ప్రధాన నిరోధ స్థాయిలుంటాయి. ప్రస్తుతం నిఫ్టీ ఈ స్థాయిలకు 100 పాయింట్ల దూరంలో ఉంది. గడిచిన రెండు నెలలుగా ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోవటానికి ప్రయత్నం చేస్తూ కరెక్షన్‌లోకి జారుకుంటోంది. ఈ స్థాయి ప్రస్తుతం స్వల్పకాలిక నిరోధ స్థాయిగా ఉంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఈ నిరోధ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది.

బేరిష్ స్థాయిలు: నిఫ్టీ ఏదైనా అప్రమత్త ట్రెండ్‌ను సూచిస్తే ప్రధాన మానసిక అవధి స్థాయిలైన 22,000 ఎగువన కచ్చితంగా నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఈ స్థాయిల వద్ద నిలదొక్కుకోలేకపోతే మైనర్ కరెక్షన్‌ను సూచిస్తుంది. తదుపరి స్వల్పకాలిక మద్దతు స్థాయిలు 21,800 దిగువన ఉంటాయి. ఇక్కడ కూడా నిలదొక్కుకోకపోతే మరింత బలహీనతను సూచిస్తుంది. 21,400 కింద ప్రధాన మద్దతు స్థాయిలుంటాయి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా కనిష్ఠ స్థాయిలైన 44,600 వద్ద రికవరీ సాధించి 46,600 వరకు వెళ్లింది. గత శుక్రవారం కరెక్షన్‌ను చవిచూసినా 750 పాయింట్ల లాభంతో 46,380 వద్ద నిలకడగా ముగిసింది. ఈ వారం పాజిటివ్ ట్రెండ్‌ను కనబరిస్తే 46,700 ఎగువన ప్రధాన నిరోధం ఉంటుంది. ఇక్కడ నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్‌ను సూచిస్తుంది. తదుపరి ప్రధాన నిరోధం 47,200. ఒకవేళ ప్రస్తుత స్థాయిలైన 46,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే అప్రమత్తతను సూచిస్తుంది.

పాటర్న్: మార్కెట్ గత రెండు నెలలుగా దీర్ఘచతురస్రాకార ప్యాట్రన్‌లో నిలిచిపోయింది. 221,50 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. దీన్ని బ్రేక్ చేస్తేనే తదుపరి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,080, 22,150
మద్దతు	21,940, 21,850

www.sundartrends.in



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి , జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

నమ్మక ద్రోహానికి నాలుగున్నర ఏళ్లు

● 1524వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, ఫిబ్రవరి 18: అమరావతిని బ్రహ్మాండంగా కడతానని ఎన్నికల ముందు చెప్పి అధికారం చేపట్టి, ఆ తర్వాత సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో నమ్మక ద్రోహం చేసి నాలుగున్నర ఏళ్లు అయ్యిందని రాజధానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు ఆదివారం నాటికి 1524వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, అన్నదాతను క్షోభ పెట్టిన వారు ఎప్పటికైనా అంతకంత అనుభవించక తప్పదన్నారు. వైసీపీ నేతలు అమరావతిపై అసత్య ప్రచారాలు చేసి పాపం మూట కట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు ముక్కలాట రాష్ట్రానికే చేటన్నారు. జీవనాధారమైన మూడు పంటలు పండే భూమిని రాష్ట్ర రాజధాని కోసం ఇచ్చామన్నారు. ఆ చట్టాన్ని కూడా కాదని జగన్‌రెడ్డి మూడు రాజధానులని రైతులను మానసిక క్షోభకు గురి చేసి రెండు వందల మందికి పైగా రైతులు మరణించటానికి కారణమయ్యాడన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. తుళ్లూరు, మందడం, వెంకటపాలెం, వెలగపూడి, ఉద్దండ్రాయునిపాలెం, అనంతవరం, నెక్కల్లు తదితర రాజధాని గ్రామాల్లో రైతుల ఆందోళనలు నిర్వహించారు.

పెళ్లి వేడుకల్లో అపశ్రుతి

● త్రుటిలో తప్పిన ప్రమాదం

● బాణసంచా పేలి వాహనం, పెళ్లి పందిరి దహనం

నరసరావుపేట, ఫిబ్రవరి 18: నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేటలో పెళ్లి వేడుకల్లో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. తృటిలో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. పెళ్లి సందర్భంగా ఊరేగింపు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచా కాలుస్తున్నారు. ఈ నిప్పురవ్వలు బాణసంచా నిల్వ ఉంచిన వాహనంపై పడ్డాయి. దీంతో నిప్పు అంటుకుని ఒక్కసారి బాణసంచా ప్రేలుడు సంభవించింది. ఆ ప్రాంతంలో జనం పరుగులు తీశారు. ఇంటి ముందు ఏర్పాటు చేసిన పెళ్లి పందిరికి కూడా నిప్పు అంటుకోవడంతో పందిరి దహనమైంది. ఫైర్ ఇంజన్ అందుబాటులో లేకపోవడంతో ఆ ప్రాంతవాసులు నీటితో మంటలను ఆర్పివేశారు. బాణసంచా నిల్వ చేసిన వాహనం, మరో తోపుడు బండి పూర్తిగా దహనమయ్యాయి.



దగ్ధమవుతున్న వాహనం

ఆర్టీసీ బస్సులన్నీ సిద్ధం సభకు..

● బస్టాండ్‌లు వెల వెల... ● ప్రైవేటు వాహనాల బాటపట్టిన ప్రయాణీకులు

● డొక్కు బస్సులతో తిప్పలు పడుతోన్న ప్రయాణీకులు

గుంటూరు, ఫిబ్రవరి 18: ఆర్టీసీ బస్టాండ్‌లు వెలవెలబోతున్నాయి. అనంతపురంలో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు తరలివెళ్లటంతో ఆర్టీసీ బస్టాండ్‌ల ప్రాంగణాలు బోసిపోతున్నాయి. అటు బస్సుల్లేక, ఇటు ప్రయాణీకుల్లేక బస్టాండ్‌లు కళావిహీనంగా మారాయి. అనంతలోని సిద్ధం సభకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 292 బస్సులు తరలివెళ్లిన విషయం తెలిసిందే. అసలే అరకొరగా ఉన్న కండిషన్ బస్సులను సీఎం సభకు తరలించటంతో డొక్కు బస్సులను మిగిల్చారు. సీఎం సభకు తరలించటంతో శని, ఆది, సోమవారం మూడు రోజుల పాటు ప్రజలు అనేక ఇబ్బందులు చవిచూడాల్సి వస్తోంది. దాంతో చేసేది లేక ప్రజలు ఆటోలు, టాటామ్యాజిక్‌లు, కార్లు వంటి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు వాహనాలు ఛార్జీల బాదుడు పెంచేశారు. అటు పర్చూరు రూట్‌లో, ఇటు అమరావతి రూట్‌లో తాడికొండ, తుళ్ళూరు, విజయవాడ రూట్‌లలో ప్రైవేటు వాహనాల ఛార్జీల బాదుడు పెంచేశారని ప్రయాణీలు వాపోతున్నారు. అసలే అరకొర బస్సులతో నెట్టుకొస్తున్న సిబ్బందికి మార్గమధ్యంలో డొక్కు బస్సులు నిలిచిపోవటం తలకు మించిన భారంగా మారుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి జీటీ రోడ్డులోని పొగాకు బోర్డు కార్యాలయం ఎదుట గుంటూరు నుంచి నరసరావుపేటకు వెళుతున్న నరసరావుపేట డిపో బస్సు అర్ధాంతరంగా నిలిచిపోయింది. దాంతో మరో బస్సు కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది.



బస్సుల్లేక వెలవెలబోయిన ఎన్‌టీఆర్ బస్టాండ్



జీటీ రోడ్డులో నిలిచిపోయిన డొక్కు బస్సు

డయేరియా మరణాలు బాధాకరం

● సీపీఐ జాతీయ కార్యదర్శి కట్టా నారాయణ ● డయేరియా బాధితులకు పరామర్శ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి18: కలుషిత నీరు తాగి నగరంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం, అనేకమంది డయేరియా బారిన పడటం బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కట్టా నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆ పార్టీ నాయకులు కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, కోటా మాల్యాద్రిలతో కలసి ఆయన పరామర్శించారు. అనంతరం కె.నారాయణ మాట్లాడుతూ సరైన సమయంలో అధికారులు స్పందించినట్లయితే ఈ ప్రమాదం వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మృతిచెందిన కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. బాధితులందరికీ వైద్య చికిత్స అందించడంతో పాటు, వారు కోలుకునే వరకు ఉచితంగా మందులు అలాగే రూ.25 వేల ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు. నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తున్న ప్రభుత్వం స్వచ్ఛమైన మంచి నీళ్ల ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మేడా హనుమంతరావు, జంగాల చైతన్య, వలి, నాసర్‌జీ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న కె.నారాయణ, కె.రామకృష్ణ

ఘనంగా ముగిసిన బాలోత్సవం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 18: స్థానిక హిందూ కళాశాలలో గత రెండు రోజులుగా పెద్దఎత్తున నిర్వహించిన బాలోత్సవం 2024 పిల్లల పండుగ ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కిడ్స్ ఇంజనీరింగ్ విద్యాసంస్థల అధినేత కోయ సుబ్బారావు, మలినేని ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ విద్యార్థి దశలో మానసిక ఎదుగుదలకు నూతన ఆవిష్కరణల రూపకల్పనలతో వారి సమగ్ర వికాసానికి బాలోత్సవాలు దోహదపడతాయని చెప్పారు. శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మూడవ బాలోత్సవంలో 40 విభాగాలలో 4,800 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి వారి ప్రతిభను ప్రదర్శించారని భవిష్యత్తులో 100 కేంద్రాల్లో బాలోత్సవాలను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్ని విభాగాలలో అత్యుత్తమంగా రాణించిన సీనియర్స్ జూనియర్స్ విభాగాలలో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ విన్నర్స్, శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ రనర్స్‌గా నిలిచి అతిథులు చేత ట్రోఫీలను అందుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్స్ జిల్లా మాజీ గవర్నర్ నూతల పార్థీ వీర ప్రకాష్‌రావు, కాటూరి వెంకటేశ్వరరావు, కన్వీనర్ డాక్టర్ ఎం.బోసుబాబు, డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్, జాన్ బాబు, కార్యదర్శి బి.ప్రసాద్, జివి సుబ్బారాయుడు, అనిల్, న్యాయ నిర్ణేతలు, వివిధ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

నడికుడి రైల్వేస్టేషన్.. ఈట్ రైట్

● ఎఫ్ఎస్ఎస్ఏఐ ద్వారా ఈట్ రైట్ స్టేషన్ సర్టిఫికేట్ ● గుంటూరు రైల్వే డివిజన్‌లో ప్రప్రథమం

గుంటూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆహారం భుజించడానికి నడికుడి రైల్వేస్టేషన్ అనువైనదని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికేట్ జారీ చేసింది. దక్షిణ మధ్య రైల్వేజోన్‌లో మొత్తం మూడు రైల్వేస్టేషన్లకు ఈ సర్టిఫికేట్ రాగా అందులో నడికుడి ఒకటిగా ఉన్నది. మిగతా రెండు హైదరాబాద్(నాంపల్లి), అన్నవరం స్టేషన్లు ఉన్నాయి. కాగా గుంటూరు డివిజన్‌లోనే నడికుడి రైల్వేస్టేషన్ ప్రప్రథమంగా ఈ సర్టిఫికేట్ పొందింది. ఇందుకోసం కృషి చేసిన ప్రతీ ఒక్క రైల్వే వాణిజ్య విభాగం అధికారులను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

ఏటా ఎఫ్ఎస్ఎస్ఏఐ రైల్వేస్టేషన్లలో ఆహార పదార్థాల నాణ్యత, వాతావరణం, పరిసరాలు, ప్రమాణాల పాటింపుని పరీక్షించి ఈట్ రైట్ స్టేషన్ సర్టిఫికేట్‌ని జారీ చేస్తుంది. డివిజన్‌లో ఈ పత్రం పొందేందుకు నడికుడి రైల్వేస్టేషన్‌ని ఎంపికచేసిన డివిజన్ అధికారులు నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందుకు అనేక చర్యలు తీసుకొన్నారు. ఫుడ్‌సేఫ్టీ, ట్రైనింగ్ మీద సలహాదారులకు శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత వాణిజ్య, ఆహార భద్రత అధికారులు వివిధ అంశాలను పరిశీలించారు. ఆహార భద్రత, పరిశుభ్రత, ప్రమాణాలు, విక్రేతల వ్యక్తిగత పరిశుభ్రత, రక్షణ పరికరాలు, ఆహార ఉత్పత్తుల గడువు తేదీలు, ఉష్ణోగ్రత నియంత్రణ, వ్యర్థాల తొలగింపు, తడి-పొడి వ్యర్థాల విభజనని పర్యవేక్షించారు. తొలుత ప్రీ-ఆడిట్‌ని నిర్వహించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేట్ జారీచేసే ముందు ఫైనల్ ఆడిట్ నిర్వహించి అన్ని సవ్యంగా ఉండటంతో పత్రం ఇచ్చింది. ఆరు నెలల పర్యవేక్షణ, మూల్యాంకనం తర్వాతే ఈ సర్టిఫికేట్‌ని నడికుడి రైల్వేస్టేషన్‌కు జారీ చేశారు.



నడికుడి రైల్వేస్టేషన్

జగన్ బీసీ వర్గాలను నయవంచన చేశారు

● రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి యేసుబాబు

చుండూరు, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి 52 సంఘాలు ఏర్పాటు చేశానని గొప్పగా ప్రకటించుకున్న ముఖ్యమంత్రి జగన్ వాటికి నయాపైసా కూడా నిధులు ఇవ్వకుండా అలంకార ప్రాయంగా మార్చారని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి యేసుబాబు ఆరోపించారు. ఆదివారం చుండూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో జగన్ ప్రసంగం అంతా బీసీ వర్గాలను మోసపుచ్చే విధంగా సాగిందన్నారు. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలులో ఉండగా దానిని జగన్ 24 శాతానికి కుదించారన్నారు. అదే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి రూ.కోట్లు నిధులు వెచ్చించి ఆ వర్గాలపై అభిమానం చాటుకున్నారు. ప్రస్తుతం మా బీసీలు అంటూ కపట ప్రేమ వలకబోస్తున్న జగన్మోహనరెడ్డి తాను ఏర్పాటు చేసిన బీసీ సంఘాల్లో దేనికి ఎంత నిధులు కేటాయించాడు, ఎంతమందికి దాని వల్ల లబ్ధి చేకూరింది, బీసీలు జగన్ పాలనలో ఎంత అభివృద్ధి చేసింది వివరించాలని యేసుబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు శొంఠి రామారావు, యడ్ల జయశీలరావు, పోతార్లంక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోని ఇరువర్గాల ఘర్షణ

నరసరావుపేట, ఫిబ్రవరి 18: నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో నిర్వహించిన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా శనివారం రాత్రి వైసీపీలోని ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రెండు సామాజిక వర్గాలవారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఘర్షణలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. క్షతగాత్రులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గడపగడపకు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట లోక్‌సభ వైసీపీ అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్ నిర్వహించారు. కార్యక్రమం అనంతరం విందు ఏర్పాటు చేశారు. విందులో సదరు సామాజిక వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేస్తుకున్నారు. ఈ సందర్భంగా ఒక వర్గం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే కేసు నమోదు చేయవద్దని రాజీ చేసుకుంటామని ప్రజాప్రతినిధులు పోలీసులను ఆదేశించారు. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదు పోలీసులు పక్కన పడేయడం పట్ల సదరు వర్గ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీవీసీ హాస్పటల్ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం

● ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

చేబ్రోలు, ఫిబ్రవరి18: డీవీసీ హాస్పటల్ ద్వారా పాల రైతులకు, పేదలకు రాయితీపై కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని వేజండ్ల గ్రామంలో డీవీసీ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని నరేంద్రకుమార్, హాస్పటల్ ఎండీ జ్యోతిర్మయి తదితరులు ప్రారంభించారు. వేజండ్ల పరిసర ప్రాంతాలకు చెందిన 650 మంది వైద్యశిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్పటల్ ఎండీ జ్యోతిర్మయి మాట్లాడుతూ సేవే లక్ష్యంగా డీవీసీ హాస్పటల్ వైద్య సేవలు అందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం ఖరీదుగా మారిన నేపథ్యంలో ప్రజలకు అందుబాటులోకి కార్పొరేట్ వైద్యాన్ని తెచ్చినట్లు చెప్పారు. అత్యుత్తమ ప్రమాణాలతో హాస్పటల్‌ను నిర్మించటమే కాకుండా అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చి ఉత్తమ డాక్టర్లతో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సీవోవో డాక్టర్ కరణం నవీన్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, వైద్యులు డాక్టర్ అమరేంద్ర, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ జిష్ను, డాక్టర్ మధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తదితరులు





హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, హాజరైన గురజాల మండలానికి చెందిన ఐటీ ఉద్యోగులు

అరాచక పాలన అంతానికి మీ ఓటే ఆయుధం

● హైదరాబాద్‌లో గురజాల ఐటీ ఉద్యోగులతో యరపతినేని సమావేశం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించేందుకు నేటి యువతకు ఓటే ఆయుధమని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నివసిస్తున్న గురజాల ప్రాంతానికి చెందిన ఐటీ ఉద్యోగులతో యరపతినేని సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గురజాల మండలానికి చెందిన వందలాది మంది ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్, నందమూరి తారకరత్న చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంతో పాటు గురజాల నియోజకవర్గంలోనూ అరాచకపాలన పెరిగిపోయిందన్నారు. వైసీపీ నేతల ధనదాహానికి పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. రాష్ట్ర రాజధాని అమరావతే లేకుండా విధ్వంసానికి పూనుకోవడం వల్ల లక్షలాది మంది యువత భవిష్యత్ అంధకారమైందన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాల్లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయగా వైసీపీ వచ్చిన ఐదేళ్లలో అవన్నీ పక్క రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. రేపటి ఎన్నికల్లో ఐటీ ఉద్యోగులు, యువత వారి కుటుంబసభ్యులందరూ చంద్రబాబుకు మద్దతుగా టీడీపీని గెలిపించాలని కోరారు. గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానని, అధికారం వచ్చిన ఐదేళ్లలో గురజాల నియోజకవర్గంలోని యువతీ యువకులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పలు మెగా జాబ్‌మేళాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. గత నెలలో గురజాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాకు అనూహ్య స్పందన లభించిందని గుర్తుచేశారు. సమావేశంలో యరపతినేని తనయుడు మహేష్, పులుకూరి కాంతారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నేలవల్లి బొల్లయ్య, పోటు నాగేశ్వరరావు, అడపా శ్రీనుతో పాటు ఐటి ఉద్యోగులు గజవల్లి నరేష్, కత్తి విఘ్నేష్, షేక్ అమీర్, బొల్నేడి రమ్య, నూదిరెడ్డి స్వాతి, శ్రీకాంత్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల పట్ల ఎప్పటికీ కృతజ్ఞతాభావం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి



ముస్లింలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 18: ముస్లింలకు తాను, తన కుటుంబం ఎప్పటికీ కృతజ్ఞతాభావంతో ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 28, 29 వార్డులకు చెందిన గొట్టిపాళ్ల వంశస్తులు 60 వైసీపీ కుటుంబాలు ఆదివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తన స్వగ్రామం వెల్దుర్తి అయినప్పటికీ పుట్టి పెరిగింది పట్టణంలోని తూర్పు బావి ముస్లిం బజారులోనే అని, ఇక్కడి స్థితిగతులపై తనకు అవగాహన ఉందని చెప్పారు. కుటుంబ పోషణ నిమిత్తం ముస్లింపెద్దలు ఎక్కువగా శ్రమిస్తుంటారని, వారి జీవన విధానం మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నాలుగున్నరేళ్లుగా ముస్లింల అభివృద్ధికి చేసిన కృషిని ఓ పేపరుపై రాసి, మరో పేపరు ఖాళీగా ఉంచాలన్నారు. తనకు అవకాశం ఇచ్చిన తరువాత నాలుగున్నరేళ్లలో ముస్లింల అభివృద్ధి మూడు రెట్లు అధికంగా చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు బాబుఖాన్, మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగూర్‌బాషా, పట్టణ అధ్యక్షుడు షైనా, యెనుముల కేశవరెడ్డి, వంగులూరి పుల్లయ్య, గోగుల సీతారెడ్డి, మేకల దాసు, జబ్బార్, జానీ, బడే వలి, గొట్టిపాళ్ల సైదా, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి ఆటవిక చర్య

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18: అనంతపురంలో జరిగిన సిద్ధం సభలో ఫొటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తల దాడి ఆటవిక చర్య అని మాజీ మంత్రి, టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటవిక జంతువులు దాడి చేసినట్టు ఉన్మాదులు, సైకోలు వీరంగం చేసినట్లు అత్యంత పాశవికంగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేశారన్నారు. ఈ దాడి రాష్ట్రంలో పరిస్థితి ఏవిధంగా ఉందో తెలియజేస్తుందన్నారు. ఇది మీడియాపై వైసీపీ చేసిన ఫ్యాక్షన్ దాడి అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు, మీడియాకు భద్రత ఉంటుందని కన్నా పేర్కొన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం


ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 18 : అనంతపురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం దుర్మార్గమని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఖండించారు. ఆయన మాట్లాడుతూ రాప్తాడులో జరిగిన సిద్ధం బహిరంగ సభకు ఏబీఎన్ తరపున జిల్లా ఫొటోగ్రాఫర్ కృష్ణ హాజరుకావటం జరిగిందని, ప్రోగ్రామ్‌ను కవర్ చేస్తున్న కృష్ణపై వైసీపీ నాయకులు, వైసీపీ గూండాలు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విలేకరులపై దాడులు దుర్మార్గం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి



మాచర్ల, ఫిబ్రవరి 18: విలేకరులపై దాడులు చేయడం దుర్మార్గమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో విలేకరులపై దాడులు పెరిగాయన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీమూకలు దాడి చేసి గాయపరచడం హేయమైన చర్య అన్నారు. ఈ దాడిని ప్రభుత్వం ఖండించకపోవడం అన్యాయమన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.42 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పౌజు సేవ


లక్ష్మీనరసింహస్వామి విగ్రహాలను ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

మాచవరం, ఫిబ్రవరి 18 : మండలంలోని మోర్జంపాడు గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి 68వ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆదివారం పౌజు సేవా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి విగ్రహాలను దేవాలయం నుంచి గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగిస్తూ పౌజు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిగీతాలు ఆలపిస్తూ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆర్కెస్ట్రా, భక్తి పాటలతో, భజన కార్యక్రమాలతో సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సమయంలో సేవా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

మోర్జంపాడు గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం సోమవారం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ వారు తెలిపారు. కల్యాణం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

కారంపూడి, ఫిబ్రవరి 18: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్ సాధ్యమవుతుందని టీడీపీ నేతలు అన్నారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం టీడీపీ నేతలు బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో అరాచకాలు, అక్రమాలు అధికమయ్యాయన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం చేసిందని, రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలునాయక్, తండా మస్తాన్‌జాని, బీసీ సెల్ కన్వీనర్ నాగేశ్వరరావు, తెలుగు యువత కన్వీనర్ తుపాకుల చినరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీలో టీడీపీ నేతలు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి ఖండన

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18 : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం సీఎం సభకు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ శ్రేణులు దాడికి పాల్పడటాన్ని పిడుగురాళ్ల ఏపీయూడబ్ల్యూజే పిడుగురాళ్ల శాఖ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించింది. వర్కింగ్ జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్‌లపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి రమేష్, పిడుగురాళ్ల ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు రామిశెట్టి మధుసూదనరావు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇటీవల అమరావతిలోను పాత్రికేయులపై దాడులు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం ఏమిటని ప్రశ్నించారు. పాత్రికేయులకు అండగా వుండాల్సిన వైసీపీ ప్రభుత్వమే దాడులకు పాల్పడటం సరికాదన్నారు. అదేవిధంగా వ్యవహరిస్తే పాత్రికేయులు కూడా తీవ్రస్థాయిలో ఉద్యమించాల్సి వస్తుందన్నారు.

తారకరత్నకు ఘన నివాళి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 18: సినీనటుడు నందమూరి తారకరత్న ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణ టీడీపీ కార్యాలయంలో తారకరత్న చిత్రపటానికి యరపతినేని సాయినిఖిల్, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, మేకల సాంబశివరావు, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, బండ్ల వెంకటేష్, చల్లగుండ్ల బాబు, వర్ల రత్నం, గుండాల ఆనంద్, కుక్కమూడి జార్జి పాల్గొన్నారు.


తారకరత్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యరపతినేని నిఖిల్, పార్టీ నాయకులు

● సత్తెనపల్లి ఫిబ్రవరి 18 : పట్టణంలోని రఘురాంనగర్‌లో గల టీడీపీ ప్రజావేదికలో ఆదివారం టీడీపీ నేత తారకరత్న వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యెలినేడి రామస్వామి, బత్తుల నాగేశ్వరరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, ఆళ్ళ సాంబయ్య, చౌటాశ్రీను, బండారు నాగరాజు, రాంబో బుడే, గుంటూరు ఆశీర్వాదం, నూర్‌బాషా జానీబాబు, ఆతుకూరి నాగేశ్వరరావు, యెలినేడి లక్ష్మీతులసీ పాల్గొన్నారు.

పేదలకు చీరలు, పంచెలు అందజేత

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 18: రొటేరియన్ వీరమాచినేని సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని ఆదివారం పట్టణంలో రోటరీ క్లబ్ మాజీ సెక్రటరీ తుమ్మల సత్యప్రసాద్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. రింగురోడ్డులోని బోస్ పెట్రోల్ బంక్ వద్ద పేదలకు చీరలు, పంచెలు, టవళ్లు అందజేశారు. అలాగే వివేకానంద అనాథ ఆశ్రమానికి ఇన్వర్టర్, బ్యాటరీని అందించారు. సత్యప్రసాద్ మాట్లాడుతూ బోస్ పేరు మీదుగా ప్రతియేటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోటరీ క్లబ్‌కు ప్రతి యేటా రూ.3 లక్షలు వితరణగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకోటయ్య, పఠాన్ నాగూర్‌వలి, కోనేరు శంకరరావు, లగడపాటి వెంకటేశ్వర్లు, ఇక్కుర్తి శంకర్, డాక్టర్ గోనిగుంట్ల శ్రీకాంత్, చెరుకూరి నరసింహారావు, కర్నాటి వాసు, ఆలేటి కోటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, మేడం నాగేశ్వరరావు, అన్నపురెడ్డి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి : ఎస్ఐ

రెంటచింతల, ఫిబ్రవరి 18 : రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, సాఫీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసు రికార్డుల్లోకెక్కిన మంచికల్లు, రెంటాల, తుమ్మకోట, మిట్టగుడిపాడు తదితర గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. మద్యం, నగదు అక్రమ రవాణా చేస్తే తమ దృష్టికి తెచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. అందరం కలిసి పని చేస్తే ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు.

మృతుల ఓట్లు తొలగించాలి : తహసీల్దార్

రెంటచింతల, ఫిబ్రవరి 18 : ఇటీవల వెల్లడైన ఓటర్ల జాబితాలో ఉన్న మృతి చెందిన వారి పేర్లను వెంటనే తొలగించాలని తహసీల్దార్ ఎస్.రామమోహనరావు ఆదేశించారు. ఆదివారం బీఎల్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ ఎంట్రీ ఓట్లు ఎక్కడా ఉండటానికి వీల్లేదన్నారు. నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించారు. మండలంలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. ఈ సమావేశంలో డీటీ బ్రహ్మయ్య, ఆర్ఐ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

మంచికల్లులో వ్యక్తిపై దాడి

రెంటచింతల, ఫిబ్రవరి 18: బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలు గృహాలకు అంటిస్తున్న క్రమంలో ఇరు పార్టీల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మండలంలోని మంచికల్లులో ఆదివారం జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకపోతుల ఈశ్వర్‌రెడ్డిపై దాడి చేసి గాయపరిచారు. ఎస్ఐ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యం

● నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ


26వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 : రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, అమరావతి రాజధానిగా కొనసాగాలన్నా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకే సాధ్యమని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలపై మోయలేని భారాలు మోపాడన్నారు. సైకో పాలనకు ప్రజలు చరమ గీతం పాడాలన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యం అన్నారు. మైనార్టీలకు తెలుగుదేశం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ఇంటింటికి తిరిగి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ముందుగా విఘ్నేశ్వరస్వామి ఆలయంలో కన్నా పూజలు చేశారు. వార్డులోని టీడీపీ, జనసేన నాయకులు కన్నాకు ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, తురకా మేరీ గ్రేస్, సయ్యద్ మాబూ, దూదేకే, రాంబో బుడే, అడుసుమల్లి వీరేంద్ర, నూర్ బాషా జానీ బాబు, ఎలినేడి లక్ష్మీతులసీ, అబ్దుల్ నబీ, ఆతుకూరి నాగేశ్వరరావు, నోముల ప్రకాష్, బండారు నాగరాజు, సయ్యద్ బాసు, నాగులు, బొంతా సాంబశివరావు, బొంతా కోటేశ్వరరావు, సయ్యద్ బడేమియా, పురుషోత్తం నాయక్, శ్రీగిరి మణికంట, పోతంశెట్టి వెంకటేష్, శ్రీగిరి రామారావు, పృధ్వీ నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పురం సుందరరావు

సత్తెనపల్లి ఫిబ్రవరి 18 : టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పురం సుందరరావును నియమిస్తూ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం నియాకపత్రం అందజేశారు. మండలంలోని గర్నెపూడికి చెందిన ఎస్సీ సెల్ అధ్యక్షుడు పురం ఆదాం మృతి చెందడంతో ఆయన సోదరుడు సుందరరావును పార్టీ అధిష్ఠానం ఎస్సీ సెల్ నూతన అధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా సుందరరావును కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళ సాంబయ్య, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల కృష్ణ, కట్టా రమేష్, గుంటూరు ఆశీర్వాదం, బొక్కా సంగీతరావు, పురం పెద ఆదాం, కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిశెలకు నిధులు కేటాయించాలి : సీపీఐ

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 18 : వరికపూడిశెల ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని కొమెర వీరాస్వామి భవన్‌లో ఆదివారం జరిగిన వామపక్ష పార్టీలు, వరికపూడిశెల జలసాధన సమితి నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలు గడుస్తున్నా ప్రాజెక్ట్ కేవలం శంకుస్థాపనలకే పరిమితమైందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రాజెక్ట్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామంటూ రాజకీయ నాయకులు ముందుకు రావడం పల్నాడు ప్రజలను మోసం చేయడమేనన్నారు. గత బడ్జెట్లో ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించకపోవడంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతురెడ్డి, జలసాధన సమితి నేతలు అనంతరామిరెడ్డి, పల్నాడు శ్రీను, బత్తుల వీరయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి మిద్దెపోగు బాబురావు, సుబ్బారావు, శివారెడ్డి పాల్గొన్నారు.

గుండాట ఆడించవద్దంటూ పంచాయతీ తీర్మానం

మాచవరం, ఫిబ్రవరి 18 : మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది గుండాట ఆటలు ఆడుతూ ఉంటారు. అయితే ఈ ఏడాది వినూత్న రీతిలో గుండాట ఆటలు ఆడించవద్దంటూ గ్రామ కమిటీ పంచాయతీ తీర్మానం చేశారు. గుండాట ఆటలు ఆడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు గ్రామ కమిటీ వారు రాతపూర్వకంగా తెలియజేశారు.

తనను వేలెత్తి చూపే స్థాయి ఎవరికీ లేదు : మదార్‌సాహెబ్

మాచర్ల, ఫిబ్రవరి 18: తనను వెలేత్తి చూపే స్థాయి ఎవరికీ లేదని టీడీపీ నేత మదార్‌సాహెబ్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను కమీషన్లు అడిగానని వైసీపీ నేతలు అంటున్నారన్నారు. గడపగడపకు కార్యక్రమంలో రూ.లక్షకు పైగా ఖర్చయితే ఎమ్మెల్యే పీఆర్కే రూ.30 వేలు మాత్రమే పంపారని, రూ.15 లక్షల వర్క్‌కు సంబంధించి కమీషన్లు తీసుకోమంటే తాను తీసుకున్నానని స్పష్టం చేశారు. ముస్లిం వైసీపీ కార్యాలయం అని ఏర్పాటు చేసి కమీషన్లు తీసుకున్నావంటూ వైసీపీ నేత కరిముల్లాను ఉద్దేశించి అన్నారు. విద్యుత్ బిల్లుల్లో నెలకు రూ.2 లక్షల వరకు వసూలు చేస్తుంది నీవు కాదా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో బాబుఖాన్, మోసిన్, సుభాని పాల్గొన్నారు.

ఎడ్లపందాలు నిరవధిక వాయిదా

రెంటచింతల, ఫిబ్రవరి 18 : శివరాత్రి పండుగ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రమైన కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో మార్చి 2 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిరవధికంగా వాయిదా వేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రానున్న ఎన్నికలకు సంబంధించి వాయిదా వేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా వైసీపీ : పీఆర్కే

కారంపూడి, ఫిబ్రవరి 18 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా వైసీపీ నిలుస్తోందని ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కారంపూడి గిరిజన కాలనీలో శనివారం రాత్రి కారంపూడి తండాకు చెందిన 16వ వార్డు బీజేపీ మెంబర్ రమావత్ జాన్‌పాల్‌నాయక్ ఆధ్వర్యాన 25 కుటుంబాలు బీజేపీ, టీడీపీలను వదిలి వైసీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పీఆర్కే పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ షేక్ షఫి, ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్, సర్పంచ్ ప్రమీలా తేజానాయక్, వైసీపీ యూత్ కన్వీనర్ చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మండల కన్వీనర్ కొంగర సుబ్రహ్మణ్యం, కొమ్ము చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పీఆర్కే


రక్త పరీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

ఆరవ వార్డులో ఉచిత రక్త పరీక్షలు

సత్తెనపల్లి ఫిబ్రవరి 18 : పట్టణంలోని 5, 6 వార్డులలో ఆదివారం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఉచిత రక్త పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి పేదలకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. 500 మందికి రక్త పరీక్షలు చేశారు. టీడీపీ నేతలు యెలినేడి రామస్వామి, చౌటా శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, యెలినేడి లక్ష్మీతులసీ, మామిడి వెంకటేశ్వరరావు, పెద్ద జాను, తోట అంబిక, పత్తిపాటి హరేకృష్ణ, జిలానీ, జానీ ఖాజావళి, జగన్నాధం, రహంతుల్లా, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిపాడు వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన


మాదిపాడు-పులిచింతల రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట, ఫిబ్రవరి 18 : మండలంలోని మాదిపాడు నుంచి పులిచింతల వరకు గల రోడ్డు పనులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదివారం శంకు స్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.3.50 కోట్లు అంచనాలతో పనులు ప్రారంభించారు. తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రోడ్డుతో తెలంగాణాతో పాటు కృష్ణా జిల్లాకు పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రయాణం సులభతరంగా మారనున్నది. ఆయనతో పాటు పార్టీ మండల అధ్యక్షుడు చిలుకా చంద్రయ్య, జడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాపరెడ్డి, ఎంపీపీ భూక్యా రజిని కృష్ణ నాయక్, మాదా వెంకటరావు, దేవరశెట్టి శ్రీనివాసరావు, రమేష్ నాయక్, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 : ప్రజా చైతన్య పార్టీ సేవా సంస్థ అధ్యక్షులు దూపగుంట్ల జానకి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే స్టేషన్ ప్రాంతంలోని 30 మంది పేదలకు దాత భవిరిశెట్టి సుబ్బారావు సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు.


సినీ హాస్యనటుడు బ్రహ్మానందం ఆదివారం గుంటూరు వెళుతూ సత్తెనపల్లిలోని తన చిన్ననాటి స్నేహితుడు నందా సాంబశివరావు గృహానికి వచ్చారు. సాంబశివరావు కుటుంబ సభ్యులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. **- సత్తెనపల్లి.**

గ్రామాలలో తాగునీటి కష్టాలు !

● ఎండిపోతున్న బావులు, బోర్లు


తంగెడలో నీరు లేక ఎండిపోయిన అతిపురాతనమైన పెద్దబావి

దాచేపల్లి, ఫిబ్రవరి 18 : వేసవి రాకముందే గ్రామాలలో బోర్లు, బావులు ఎండిపోతున్నాయి. తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామాలలో మూడొంతులకు పైగా బోర్లు నీరులేక పనిచేయకపోవడంతో నీటి అన్వేషణ ప్రారంభిస్తున్నారు. వాగులు, వంకలు, చెరువులు నీరు లేక ఎండిపోతున్నాయి. మే నెలలో పడాల్సిన నీటి కష్టాలు జనవరి, ఫిబ్రవరి నెలలోనే కనిపించడం పై ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాలలో పర్యటిస్తున్న అధికారులను, ప్రజా ప్రతినిధులను తాగునీటి సమస్యపై ప్రజలు ఏకరువు పెడుతున్నారు. ప్రధానంగా దాచేపల్లి నగర పంచాయతీలో నారాయణపురం, ఇరికేపల్లి గ్రామాలలో బోర్లు పని చేయడం లేదు. కేశానుపల్లి, తక్కెళ్లపాడు, తంగెడ, పెదగార్లపాడు, రామాపురం, గామాలపాడు గ్రామాలలో 300 అడుగుల లోతు ఉన్న బోర్లు పనిచేయడానికి మొరాయిస్తున్నాయి. అధికారులు తాగునీటి సమస్యలపై దృష్టి సారించకపోవడం, పనిచేయని బోర్లు మరమ్మతులపై శ్రద్ధ చూపించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చివరకు గ్రామాలకు దూరంగా ఉన్న మైనింగ్ క్వారీలలో నిల్వ ఉన్న నీటినే ఇంటి అవసరాలకు వాడుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఈ నీటిని పశువులను కడిగేందుకు, మల, మూత్ర విసర్జనకు ఉపయోగించేవారు. ఇదేనీరు ఇంటి అవసరాలకు వాడుకోవాల్సి రావడం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం మొద్దునిద్ర వీడకుండా ఇదేవిధంగా వుంటే నీటికై ప్రజలు యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. 500 అడుగులకు పైబడిన బోర్లు మాత్రమే తాగునీటిని అందిస్తున్నాయి. అధికారులు అలసత్వం వదిలి అప్రమత్తంగా లేకుంటే అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతుందనడంలో సందేహం లేదు.


ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేస్తున్న దాచేపల్లి నగర పంచాయతీ సిబ్బంది


సీట్ల కోసం ప్రయాణికుల ఇబ్బందులు

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 : అనంతపురంలో ఆదివారం జరిగిన ముఖ్యమంత్రి సిద్ధం సభకు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి శనివారం రాత్రి 20 బస్సులను తరలించ టంతో ఆదివారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉన్న బస్సులు సమయానికి రాక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తాలూకా సెంటర్, బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూశారు. గంటకు ఒక బస్సు రావటంతో అందులో సీట్ల కోసం ఎగబడే పరిస్థితి ఎదురైంది. సీఎం సభకు బస్సులు తరలించటం వల్ల ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం అని చెప్పవచ్చు.

ముర్రిబోయిన లక్ష్మీనారాయణ మృతి టీడీపీకి తీరనిలోటు

రాజుపాలెం, ఫిబ్రవరి 18: మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన ముర్రిబోయిన లక్ష్మీనారాయణ (55) మృతి చెందారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తనయుడు, మాజీ మేయర్ నాగరాజు ఆదివారం గ్రామానికి చేరుకొని లక్ష్మీనారాయణ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంతేకాకుండా మండలంలోని బలిజేపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆలా సుబ్బారావు మాతృమూర్తి బసవమ్మ (75) మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నాగరాజు బలిజేపల్లి గ్రామానికి చేరుకొని బసవమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, సర్పంచ్ కణదం పద్మ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు సఖినాల వలిరాజు, వాసా వెంకటేశ్వర్లు, రాజుపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు జంగం రాజా, పార్టీ నాయకులు చొక్కా శ్రీనివాసరావు, పగడాల శ్రీనివాసరావు, కణదం వెంకటరావు, లేపాకుల బ్రహ్మయ్య, మొరసా శ్రీనివాసరావు, పాడి పెదవెంకటేశ్వర్లు, తదితరులున్నారు.

అప్పయ్య మృతి బాధాకరం

సత్తెనపల్లి రూరల్, ఫిబ్రవరి 18 : అప్పయ్య మృతి బాధాకరమని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని ధూళిపాళ్ళకు చెందిన నాదెండ్ల అప్పయ్య మృతి చెందారు. మృతి వార్త తెలుసుకున్న నాగరాజు ఆదివారం ధూళిపాళ్ళ వచ్చి అప్పయ్య మృతదేహాన్ని సందర్శించి పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట గ్రామ టీడీపీ నాయకులు ఉన్నారు.

నేడు మండల టీడీపీ కార్యాలయం ప్రారంభం

రాజుపాలెం, ఫిబ్రవరి 18 : రాజుపాలెం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం సోమవారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు తెలిపారు. ఆదివారం రాజుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పెద్దిరాజు మాట్లాడుతూ రాజుపాలెంలో గుంటూరు-మాచర్ల రహదారిపై అంకమ్మతల్లి దేవాలయం సమీపంలో కార్యాలయం ప్రారంభించనున్నట్లు చెప్పారు. తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చర్చి మరమ్మతులకు చెక్కు అందజేత

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 : పట్టణంలోని వడ్డవల్లి శాస్త్రి నగర్‌లో సియోన్ దేవాలయ చర్చి మరమ్మతులు, అభివృద్ధి కోసం జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు రూ.1.16 లక్షల చెక్కును పాస్టర్ సత్యానందం, చర్చి కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. బొర్రా వెంకట అప్పారావును చర్చి కమిటీ సభ్యులు కిరణ్ కుమార్, జోయబ్, తాళ్ళూరి ప్రేమ్ కుమార్, బండారు నాగరాజు, జిర్రా గణేష్ తదితరులు ఘనంగా సన్మానించారు.


చర్చి పెద్దలకు చెక్కు అందిస్తున్న బొర్రా అప్పారావు

నేడు టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

పెదకూరపాడు, ఫిబ్రవరి 18 : మండలంలోని 75 తాళ్ళూరులో రూ.2 కోట్లతో నిర్మించనున్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపానికి సోమవారం శంకుస్థాపన జరుగుతుందని క్రోసూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, 75 తాళ్ళూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్ కల్లి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొంటారని, ఉదయం 10:30 గంటలకు శంకుస్థాపన జరుగుతుందని వారు వివరించారు.

వైసీపీని ఓడించటమే అంబేద్కర్ వారసుల లక్ష్యం : కొర్రపాటి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 18 : వైసీపీని ఓడించటమే అంబేద్కర్ వారసుల లక్ష్యమని టీడీపీ రాష్ట్ర ఎస్సీ నాయకులు కొర్రపాటి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ విద్యా పథకానికి అంబేద్కర్ పేరు తొలగించి జగన్ తన పేరు పెట్టుకొని అంబేద్కర్‌ను అవమానించాడన్నారు. అంబేద్కర్ కంటే తానే గొప్పవాడిగా జగన్ ఫీలవుతున్నాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకర్ వ్యాఖ్యలు అంబేద్కర్ వారసుల ఆత్మగౌరవాన్ని, మనోభావాలను కించ పరిచేలా ఉన్నాయన్నారు. జూపూడి ప్రభాకర్ అంబేద్కర్ వారసులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

నిలిచిన రహదారి నిర్మాణ పనులు


నిలిచిపోయిన నరసరావుపేట - చేజర్ల రహదారి నిర్మాణం

నకరికల్లు, ఫిబ్రవరి 18 : నకరికల్లు మండలంలో రహదారుల నిర్మాణాలు నిలిచిపోయాయి. చాగల్లు నుంచి తొండపి వెళ్ళే రహదారి మరమ్మతు పనులు ప్రారంభించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆ పనులు నిలిచిపోయాయి. నరసరావుపేట నుంచి చేజర్ల వరకు రహదారి విస్తరణ నిర్మాణం మూడు సంవత్సరాలు గడుస్తున్నా ముందడుగు పడటం లేదు. కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు సకాలంలో రాక పోవటంతో మధ్యలోనే చేతులు ఎత్తివేశారు. కొంత దూరం నిర్మించి మరికొంత దూరం వదిలేస్తూ రహదారి నిర్మాణాలు నిలిచి పోయాయి. పలుమార్లు ఈ రహదారుల నిర్మాణం గురించి చాగల్లు - తొండపి రహదారి మరమ్మతుల పనుల గురించి అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ఈ రహదారుల నిర్మాణాలను, మరమ్మతులను తక్షణం పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


రాళ్ళు మొన తేలిన చాగల్లు-తొండపి రహదారి

పల్నాడు వార్తలు

మక్కెనతో ఉప్పలపాడు వైసీపీ నాయకులు



భవిష్యత్తు కార్యచరణపై మక్కెనతో చర్చిస్తున్న ఉప్పలపాడు వైసీపీ నాయకులు

వినుకొండ, ఫిబ్రవరి 18 : ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావును నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కలిశారు. మక్కెన అడుగుజాడల్లో నడవడానికి మేమంతా సిద్ధమంటూ ముక్తకంఠంగా తెలి పారు. అదేవిధంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును కలిసి పట్టణ అభివృద్ధిపై చర్చించారు.

21 నుంచి బీజేపీ ఆధ్వర్యంలో 'ప్రజాపోరు'



సమావేశంలో మాట్లాడుతున్న మేడం రమేష్

వినుకొండటౌన్, ఫిబ్రవరి 18: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గంలో ఈ నెల 21వ తేదీ నుంచి ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ ఆదివారం తెలిపారు. ఫిబ్రవరి 21వ తేదీన శావల్యాపురం, 22, 23 తేదీల్లో ఈపూరు, 25న వినుకొండ రూరల్, 26, 27 నూజెండ్ల, 28, 29న బొల్లాపల్లి మండలాల్లో ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రజాపోరు ప్రజారథంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు, గ్రామాభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పథకాల గురించి సూచిస్తామని ఆయన తెలిపారు. కావున కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొంటారని, బీజేపీ నాయకులు, వివిధ అనుబంధ సంఘ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మిద్దెబావి ఆక్రమణదారులపై కఠినచర్యలు తీసుకోవాలి

వినుకొండ పట్టణంలోని వెల్లటూరు రోడ్డు నందు గతంలో పేదలకు పంపిణీ చేసిన స్థలాలను కొందరు ఆక్రమించుకొని నిజమైన లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కొందరు మిద్దెబావిలోని ప్లాట్లను ఆక్రమించుకొని వారిని ఆ ప్రాంతం నుంచి తరిమి అమ్మకాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికే పట్టాలు తయారు చేస్తున్న వ్యక్తులను గుర్తించామని, గతంలో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆక్రమదారులపై కేసులు బనాయించి కఠిన చర్యలు తీసుకొని లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గొడవర్తి సుజాత, గట్టుపల్లి శ్రీనివాసరావు, వేమా కొండలు, పూరేటి పేరయ్య, ఆవుల శ్రీను, కొటారు సుధ, మందా రామారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన అధినేత పవన్ బహిరంగ సభకు స్థల పరిశీలన

వినుకొండ, ఫిబ్రవరి 18 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్‌కళ్యాణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్నాడు జిల్లా వినుకొండలో త్వరలో పర్యటిస్తున్నట్లు సెంట్రల్ ఆంధ్ర కోకన్వీనర్‌లు నిశ్శంకర శ్రీనివాసరావు, పెంటేల బాలజీ, ప్రోగ్రామ్ కమిటీ ఛైర్మన్ కల్యాణం శివశ్రీనివాసరావులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లి సమీపంలో గల లయోలా ఉన్నత పాఠశాలలోని హెలిప్యాడ్‌తో పాటు శివయ్యస్థూపం సెంటర్, ఆర్టీసీ డిపో సెంటర్‌లోని బహిరంగ సభ నిర్వాహణ కోసం స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు ఉన్నారు.

సృజనాత్మకత పెంపొందించేందుకు కళలు దోహదం

● సర్పంచ్ యూనిస్ ● ఎంపీయూపీ పాఠశాలలో అంతర్జాతీయ రంగోత్సవ్



రంగోత్సవ్ పోటీల్లో పాల్గొన్న కొండవీడు ఎంపీయూపీ విద్యార్థులు

కొండవీడు(యడ్లపాడు); ఫిబ్రవరి 18: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు రంగోత్సవ్ లాంటి కళలు దోహదం చేస్తాయని కొండవీడు గ్రామసర్పంచ్ యూనిస్ అన్నారు. మండలంలోని కొండవీడు ఎంపీయూపీ పాఠశాలలో రంగోత్సవ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. అంతర్జాతీయ కళలు, సృజనాత్మక విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 36మంది విద్యార్థులు పాల్గొని విభిన్నమైన చిత్రాలను చిత్రించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనిస్ మాట్లాడుతూ విద్యతోపాటు విభిన్న అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ఎంఈవో నాగరత్నం మాట్లాడుతూ గతంలో జరిగిన జాతీయస్థాయి రంగోత్సవ్ పోటీల్లోనూ పాల్గొని మెడల్స్ సాధించారని, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడం గర్వకారణం అన్నారు. హెచ్‌ఎం గోరంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఘన్నుసాహెబ్, విద్యా కమిటీ ఛైర్మన్ నందికోలు సత్యవాణి, ఎంపీటీసీ శ్రీనివాసరావు, గ్రామపెద్దలు జాకీర్‌హుస్సేన్, వై వెంకట్రావు, వెంకటేశ్వర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 18: పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్లో ఆదివారం పల్నాడు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్‌ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా మాధవరావు, కార్యదర్శిగా మల్లికార్జునరావు, కోశాధికారిగా కోటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యాపార వర్గాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. వినియోగదారులకు నాణ్యమైన మందులు సరసమైన ధరలకు సరఫరా చేసే విధంగా వ్యాపారం చేయాలన్నారు.

విదేశీ విద్య పేరు మార్పును సమర్థించటం దారుణం

రొంపిచర్ల, ఫిబ్రవరి 18: విదేశీ విద్యకు అంబేద్కర్ పేరును తీసివేసి జగన్మోహన్‌రెడ్డి పేరు పెట్టుకున్న ఆనందమేనని జూపూడి ప్రభాకర్ మాట్లాడటం సిగ్గుచేటని దళిత బహుజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోదా రమేష్ కుమార్ ఆదివారం ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో విదేశీ విద్యకు తక్కువ నగదు ఇచ్చారని, ఇప్పుడు అధిక నగదు ఇస్తున్నామని, దీనికి గాను జగన్మోహన్‌రెడ్డి పేరు పెట్టడం సబబేనని ప్రభాకర్ వ్యాఖ్యలు చేయటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నలగార్లపాడు అంబేద్కర్ నగర్‌లో ఆయన మాట్లాడారు. ఈ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కేటాయింపులపై మున్సిపాలిటీలో తీర్మానం

● ఆచరణలో శూన్యం.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 18 : అధికార పార్టీకి అండగా నిలిస్తే సమస్యలు పరిష్కరిస్తారని భావించిన పట్టణవాసులకు వార్డుల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో వైసీపీ పనితీరుపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం వినుకొండ మున్సిపాలిటీలో వైసీపీకి పట్టం కట్టారు. వార్డుల్లో గెలుపొందిన కౌన్సిలర్లకు పనులు కేటాయిస్తున్నట్లు నమ్మపలికారు. నిధులు కేటాయింపుపై మున్సిపాలిటీలో తీర్మానాలు చేశారు. మున్సిపాలిటీలో తీర్మానమైన పనులు మాత్రం ఆచరణకు నోచుకోవడం లేదు. వినుకొండ కొండ మెట్ల వద్ద 23వ వార్డులోని అబ్బాయికుంట నీటి నిల్వ ఉండటంతో తరచూ పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు. షేక్ ఇర్ఫాన్ అనే 3 సంవత్సరాల చిన్నారి కుంటలో పడి మృతిచెందడంతో కుంటలో ప్రమాదాలు జరగకుండా అప్పుడు రూ.5లక్షలు నిధులు కేటాయించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కుంటకు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. ఇదిలా ఉండగా 18వ వార్డులోని పోలేరమ్మ గుడి ఆవరణలో స్థానిక ప్రజల ఆహ్లాదం కొరకు పార్కు నిర్మాణానికి రూ.5లక్షలు నిధులు కేటాయించి సమావేశంలో తీర్మానం ఆమోదించారు. ఇలా పట్టణంలోని 32 వార్డుల్లో ప్రజలకు అత్యంత అవసరమైన పనులకు నిధులు కేటాయించి తీర్మానం చేశారే తప్ప నేటికి అవి ఆచరణకు నోచుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి పట్టంగడితే సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా మున్సిపాలిటీలో ఆమోదించిన పనులకు నిధులు కేటాయించి పనులు జరపాలని ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 18: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 28వ వార్డు ఓబయ్యకాలనీలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ అధ్యక్షతన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా ప్రతి ఇంటికి వెళ్లి పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశంను ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకే భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో పథకాలను ప్రకటిస్తున్నామని వెల్లడించారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేసి రాజధాని ఎక్కడో కూడా చెప్పలేని దుస్థితిలో ప్రభుత్వం నెలకొని ఉందని, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాయల మరాఠీగా మారారని, అధికారాన్ని అడ్డంపెట్టుకొని రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి రోడ్డు మార్గాన్ని చూపి ఆ ప్రాంతంలోని భూములను కొనుగోలు చేశారని, వెంకుపాలెం సమీపంలో పేదలకు అటవీ భూములను కట్టబెట్టి కోట్ల రూపాయలు దోచుకున్నారన్నారు. ప్రజలకు అవసరమైన హామీలను ఇప్పటికే నెరవేర్చామని, బొల్లా అమలు కానీ హామీలను అమలు చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్, మైనార్టీ సెల్ కమిటీ సభ్యుడు సౌదాగర్ జానీబాషా, పత్తిపూర్ణ, పి.వి.సురేష్, గంధం కోటి, పువ్వాడ కృష్ణ, దూళ్ల నాగార్జున, పల్లమీసాల దాసయ్య, మంచాల హనుమంతరావు, రాజు, దస్తగిరి, కాళింగరాజు, ఇండియన్ మెకానిక్ కరిముల్లా, గోల్డ్ కరిముల్లా, పొట్లపాడు వలి, రియల్‌ఎస్టేట్ జానీ, యూత్ జానీ, ఇమ్రాన్, వి.లక్ష్మి, ఆదిలక్ష్మి, చౌడమ్మ, కోటమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జంగమేశ్వరపాడులో క్షతగాత్రులకు పరామర్శ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 18 : నరసరావుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జంగమేశ్వరపాడులో వైసీపీ వారి దాడుల్లో గాయపడిన వారిని జీవీ ఆంజనేయులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీసీకి చెందిన కోటయ్యను చంపారని, ఆ తర్వాత అదే గ్రామంలో జల్లయ్యను చంపారని, ఈ రోజు పాశంరాజు, అంజి, గున్నా శ్రీను మీద హత్యాప్రయత్నం చేశారన్నారు. వాళ్ళు పొలాలు వదలిపెట్టి పక్క గ్రామాల్లో తలదాచుకుంటున్నారని అన్నారు. అమ్మవారి వద్దకెళ్ళి పూజలు చేసుకొని గ్రామానికి వెళ్ళుతుంటే వెంటాడి హత్యాయత్నం చేశారన్నారు. ఘటన జరిగి నాలుగు రోజులైతే హత్యాయత్నం చేసిన వాళ్ళు గ్రామంలో హల్‌చల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జల్లయ్యను చంపిన ముద్దాయిలు మరలా అదే వ్యక్తులు హత్యాయత్నం చేస్తే ఎస్పీ ఏమి చేస్తున్నారని నిలదీశారు. పోలీ సుల సహకారం ఉండబట్టే పల్నాడు ప్రాంతం మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో పెద్దఎత్తున దుర్మార్గాలు పెరిగిపోయాయన్నారు. ఇది చాల దుర్మార్గమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, అంతకంతకు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఇలాంటి దుర్మార్గాలకు చరమగీతం పాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. యాదవలపై అతికిరాతకంగా దాడి చేసి హత్యాయత్నం చేస్తే నరసరావుపేట ఎంపీగా పోటీచేస్తానంటున్న అనిల్‌కుమార్ యాదవ్ కనీసం ప్రభుత్వం తరపున ఎందుకు పరామర్శించలేదని? ప్రశ్నించారు. బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇచ్చి ఆ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్, రావర్ల జగ్గారావు, దాసరి నరసింహారావు, బండారుపల్లి విశ్వేశ్వరరావు, యేనుగంటి భార్గవ్‌సాయి, మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, బాధితకుటుంబ సభ్యులు ఉన్నారు.



దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

● వైద్యశిబిరానికి అనూహ్య స్పందన : ప్రత్తిపాటి పుల్లారావు



మెగా వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 18: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఆదివారం ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ సెంటినీ ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించిన 35వ వైద్యశిబిరానికి చిలకలూరిపేట పరిసర ప్రాంతాల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రత్తిపాటి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. గుండె, థైరాయిడ్, కిడ్నీ, జీర్ణాశయం, క్యాన్సర్ సంబంధిత జబ్బులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ఒకరి ఆరోగ్యాన్ని నయం చేయటమంటే ఆ కుటుంబాన్ని కాపాడినట్లేనని, ఆ సంతృప్తి కోసమే ఎన్నో ఏళ్ళుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరాల్లో ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవటం వల్ల సకాలంలో వ్యాధి నిర్ధారణ అవుతుందని, తద్వారా సకాలంలో చికిత్స పొందవచ్చన్నారు. చిలకలూరిపేట ప్రజల సంక్షేమం ఉన్నతే లక్ష్యంగా ప్రత్తిపాటి ఫౌండేషన్ సేవలు అందిస్తుందన్నారు. ఈ రోజు పలు రకాల వైద్యసేవలను ఈ శిబిరం ద్వారా అందించామని ప్రత్తిపాటి తెలిపారు.

రక్తదానం చేయండి.. ప్రాణ దాతలుగా నిలవండి

మనం దానం చేసే ప్రతి రక్తపుబొట్టు మరొకరికి జీవనరేఖగా మారి వారి ప్రాణాలు నిలబెడుతుందనే విషయాన్ని గుర్తించి రక్తదానం చేయడాన్ని ప్రోత్సహించాలని ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం పట్టణంలో దిల్‌సే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదాతలను, ఫౌండేషన్ నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పది రూపాయల వైద్యురాలిగా పేరుగాంచిన కడపకు చెందిన ప్రముఖ వైద్యురాలు నూరీ పర్వీన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్న పర్వీన్‌ను ప్రత్తిపాటి అభినందించారు. పర్వీన్ తరహా యువవైద్యులు బాధ్యతగా ఉంటే ఎంతో మంది పేదలకు ప్రయోజనం కలుగుతుందని ప్రత్తిపాటి యువ డాక్టర్లకు సూచించారు.

ఇంటింటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వేల్పూరులో కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం, ఫిబ్రవరి 18: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని వేల్పూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో 700 ఇళ్ళకు జల్‌జీవన్‌మిషన్ నిధులు రూ.కోటితో ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయిలను ఆదివారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వగ్రామమైన వేల్పూరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, ప్రతిపక్షాలు అభివృద్ధికి సహకరించకపోగా తనపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. అనంతరం శావల్యాపురం సొసైటీ ఆధ్వర్యంలో పోట్లూరులో రూ.40లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సొసైటీ ద్వారా వేల్పూరులో కోల్డ్‌స్టోరేజీ, 4గ్రామాల్లో మల్టీపర్పస్ గోడౌన్‌లు నిర్మించడమే కాక రైతులకు వివిధ రాయితీలు, రుణాలు అందిస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతున్న సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి చెన్నయ్యను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, ఈపూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి సర్పంచ్ బీర్నీడి రత్నగిరి, సీనియర్ నేతలు గుత్తా కోటేశ్వరరావు, మాబు సుబానయ్య, తూమాటి కబ్బీరావు, స్వర్ణాల వెంకట్రావు, ఎం రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

సంతగుడిపాడులో పూరిల్లు దగ్ధం

రొంపిచర్ల, ఫిబ్రవరి 18 : మండలంలోని సంతగుడిపాడు ఎరుకల కాలనీలో ఉయ్యాల రామకోటయ్యకు చెందిన పూరి గుడిసె ఆదివారం దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించింది. మంటలు వ్యాపించటంతో చుట్టు పక్కల వారు గమనించి నీటితో మంటలను అదుపులోకి తీసుకురావటానికి ప్రయత్నించారు. ఇంట్లోని వారికి ఎటువంటి ప్రమాదం సంభవించ లేదు. ఈ ప్రమాదంలో సుమారు రూ.60వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.


వైభవంగా ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల, ఫిబ్రవరి 18: మండలంలోని రొంపిచర్ల గ్రామంలో ఉన్న శంకర్ స్వామి ఆలయ 5వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామి వారికి పంచామృతాభిషేకం పూజలను అర్చకులు శ్రీనివాసశర్మ నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో పార్వతిదేవి అమ్మవారు

నందమూరి తారకరత్నకి ఘన నివాళి



తారకరత్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లీలావతి, టీడీపీ నాయకులు

వినుకొండ, ఫిబ్రవరి 18: నందమూరి తారకరత్న మొదటి వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ లీలావతి ముఖ్యఅతిథిగా పాల్గొని తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు షమీమ్, పెమ్మసాని నాగేశ్వరరావు, సౌదాగర్ జానీ, రొడ్డా వీరాంజనేయరెడ్డి, పత్తి పూర్ణ, లక్ష్మి, బసవమ్మ, ఎలియాజర్ పాల్గొన్నారు.

నేడు ఈపూరు మండల సర్వసభ్య సమావేశం

ఈపూరు, ఫిబ్రవరి 18: మండల ప్రజాపరిషత్ సర్వసభ్యసమావేశం సోమవా రం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఏవీ రంగనాయకులు తెలిపారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనుల గురించి చర్చిస్తారన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

రేపు నూజెండ్ల సర్వసభ్య సమావేశం

నూజెండ్ల, ఫిబ్రవరి 18: నూజెండ్ల మండల సర్వసభ్య సమావేశం మంగళ వారం ఉదయం 10 గంటలకు జరగనున్నట్టు ఎంపీడీవో టీ వీరభద్రా చారి ఆదివారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బొల్లాపల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని లాలీపురం జంక్షన్ వద్ద రెండు ఎదురెదురుగా బైక్‌లు ఢీకొనటంతో బీఎల్ కాలనీకి చెందిన బేతం దేవదాసు(50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హనుమాపురంనకు చెందిన కృష్ణానాయక్ కాలు విరిగింది. పోస్టుమార్టం నిమిత్తం దేవదాసు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ చెన్నకేశవులు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎదురెదురుగా రెండు లారీలు ఢీ

వినుకొండటౌన్, ఫిబ్రవరి 18: మండలంలోని శివాపురం వద్ద ఎదు రుగా వస్తున్న ఆటోను తప్పించబోయి ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో డ్రైవర్లకు స్వల్పగాయాలైన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. వినుకొండ నుంచి గిద్దలూరు ఐరన్ లోడుతో వెళ్తున్న లారీ ఆత్మకూరు నుంచి అల్లం లోడుతో వినుకొండ వైపు వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో డ్రైవర్లకు స్వల్పగాయాలయ్యాయి. ఆత్మకూరు నుంచి వినుకొండ వైపు వస్తున్న లారీ పాక్షికంగా దెబ్బతినడంతో లారీలో ఉన్న అల్లం లోడును మరో లారీ సాయంతో తరలించారు. స్టేట్ హైవే సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైవోల్టేజీకి దెబ్బతిన్న ఎలక్ట్రికల్ సామాన్లు

కొచ్చెర్ల(ఈపూరు), ఫిబ్రవరి 18 : మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో హైవోల్టేజికి ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. టీవీలు, ఫ్యాన్లు, టూబ్‌లైట్లు దెబ్బతిన్నాయి. సుమారు 20 గృహాల్లో ఎలక్ట్రికల్ వస్తువులు చెడిపోయాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపమే హైవోల్టేజీకి కారణమని బాధితులు అంటున్నారు. విద్యుత్‌శాఖాధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని కోరుచున్నారు.

వైసీపీ పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధి లేదు

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు



కోటప్పకొండలో ఇంటింటికి తిరిగి అవగాహన కలిగిస్తున్న చదలవాడ అరవిందబాబు

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 18: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్ళ వైసీపీ పాలనలో అరాచకాలే తప్ప అభివృద్ధి జరగలేదని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. నరసరావుపేట మండలం కొండ కావూరు పంచాయతీ పరిధిలోగల మోపువారిపాలెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మిని మేనిఫెస్టోతో వైసీపీకి చమటలు పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో టీడీపీ - జనసేన పొత్తుతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పల్నాడు జిల్లా నరసరావుపేట గడ్డపై తెలుగుదేశం జెండా ఎగరడం కాయమన్నారు. రానున్న రెండు నెలల కాలం కార్యకర్తలు, నాయకులు సమష్టి కృషితో పనిచేయాలన్నారు. గ్రామాల్లో ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ కడియాల జన్మదిన వేడుకలు

● యలమంద కల్యాణ మండపానికి రూ.5 లక్షలు విరాళం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, పక్కన జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 18: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని కడియాల హాస్పిటల్స్ ఆవరణలో టీడీపీ రాష్ట్ర డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలకు టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 40సంవత్సరాలుగా మా కుటుంబం టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటున్నామని, ఎన్నో కేసులు పెట్టారని అయినా అండగా ఉన్నామన్నారు. యలమందలో ప్రజల అవసరం కోసం కల్యాణ మండపానికి గతంలో మా కుటుంబం తరపున రూ.15 లక్షలు విరాళం ఇచ్చామన్నారు. కల్యాణ మండపం అభివృద్ధికి మరో రూ.5 లక్షలు విరాళంగా ఇవ్వాలని పుట్టిన రోజు సందర్భంగా నిర్ణయించుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రియాదవ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రమేష్, తిరుమలకొండ నరసింహారావు, పులుకూరి జగ్గయ్య నాగిరెడ్డి, కొట్టా కిరణ్, షేక్ మన్నాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ పునర్నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 18: మండలంలోని ఇసప్పాలెంలో ఉన్న మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసరావుపేట పట్టణంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పునర్నిర్మాణం కోసం నరసరావుపేట వాస్తవ్యులు కొప్పురావూరి ఆంజనేయులు, శివలలిత దంపతులు రూ.5 లక్షల విలువగల చెక్కును ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుదాకరరెడ్డికి అందజేశారు. అనంతరం ఆలయంలో మహంకాళి అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు కొప్పురావూరి ఆంజనేయులు, శివలలిత దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుదాకరరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొత్త సాంబశివరావు, ధర్మకర్తల మండలి సభ్యులు కాకుమాను వెంకట బదరీ నారాయణ, బూసా సుబ్రమణ్యేశ్వరరావు, నంద్యాల మాధవీదేవి, ఆలపాటి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు బాలోత్సవ్‌లో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 18: ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో గుంటూరులోని హిందూ కళాశాలలో రెండ్రోజుల పాటు నిర్వహించిన బాలోత్సవ్‌లో వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ముందంజలో నిలిచారని గైడ్ టీచర్ జ్యోతి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏక పాత్రాభినయంలో స్వామివివేకానంద ద్వితీయస్థానాన్ని, జూనియర్స్ విభాగం లఘునాటికలో శ్రీవల్లి, గాయత్రి, హేమ, నందు, సాయిచైతన్య, హర్ష, అభిలు తృతీయస్థానాన్ని, మ్యాప్ పాయింటింగ్‌లో సాయిచైతన్య ద్వితీయ స్థానాన్ని, జానపద నృత్యం సీనియర్స్ విభాగంలో వివేక్, శ్రీలత, రేణుక, ప్రసన్న, సంధ్య, లక్ష్మీహారిక, నాగరోషిణి, అక్షయ, శ్రావణిలు ప్రథమస్థానాన్ని సాధించినట్లు తెలిపారు. కోలాటంలో త్రిష, నాగరోషిణి, లక్ష్మీహారిక, శ్రీలత, హేమలత, తులసిప్రసన్న, సంధ్య, శ్రీవల్లి, గాయత్రి, మస్తాన్‌బీ, శ్రావణి, అక్షయ, జయశ్రీలు కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు తెలిపారు. విజేతలను ఎమ్మెల్సీ లక్ష్మణరావు అభినందించి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. విజేతలను పీఎంసీ ఛైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, హెచ్‌ఎం సుభానీ అభినందించారు.

కొత్తలూరులో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కొత్తలూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 18: త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక వారి ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోనంద యోగేశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీతపై మండలంలోని కొత్తలూరులో కమిటీ సభ్యులు ఆదివారం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి మాఘమాసంలోని మాఘపూర్ణిమ, రథసప్తమి, శివరాత్రి పండుగల ప్రత్యేకలను వివరించారు. కమిటీ సభ్యులు యద్దనపూడి రామాంజనేయులు, చిర్రా వెంకటరామిరెడ్డి, పోట్లూరు పుల్లయ్య, గంగయ్య, కోటేశ్వరమ్మ, సామ్రాజ్యమ్మ పాల్గొన్నారు.